ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
బుధవారం 28 ఫిబ్రవరి 2024



17.65 లక్షలు!

ఉమ్మడి జిల్లాలో గృహజ్యోతి, మహాలక్ష్మి లబ్ధిదారులపై దాదాపు స్పష్టత

- 7.50లక్షల మందికి ఉచిత విద్యుత్, 10.15లక్షల మందికి సబ్సిడీ గ్యాస్
- మార్చి ఒకటో తేదీ నుంచి అమల్లోకి..

హనుమకొండ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరుగ్యారంటీ పథకాల్లోని 200యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కు గ్యాస్ సిలిండర్ పథకాలను ప్రారంభించింది. గతంలోనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితప్రయాణంతో పాటు.. ఆరోగ్యశ్రీ పరిధిని రూ.5 లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచి హామీని నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా మంగళవారం 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు సంబంధించి గృహజ్యోతి, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ సరఫరాకు సంబంధించి మహాలక్ష్మి పథకాలకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఈ పథకాలను ఒకటో తేదీ నుంచి అమల్లోకి తేనుండగా.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఈ పథకాలకు అర్హులైన వారి లెక్కతేలిందని, గృహజ్యోతి పథకం కింద 7.50 లక్షల మంది, మహాలక్ష్మి పథకం కింద 10.15 లక్షల మంది లబ్ధిపొందనున్నారని అంచనా. అయితే నెలనెలా తడిసి మోపెడవుతున్న కరెంట్ బిల్లులను చెల్లించలేని నిరుపేద, మధ్య తరగతి కుటుంబాల వారికి ఉపశమనం కలిగించేలా, అలాగే దారుణంగా పెరిగిన ధరతో పేదలకు గుదిబండగా మారిన గ్యాస్ బండ బరువును తగ్గించేందుకు ప్రభుత్వం ఈ రెండు పథకాలను అమలులోకి తీసుకువస్తోంది.

గృహజ్యోతితో లబ్ధి ఇలా..

ఉమ్మడి జిల్లాలో సుమారు 7.50 లక్ష మంది గృహజ్యోతి పథకం కింద లబ్ధి పొందే అవకాశాలున్నాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తంగా 8.62 లక్షల మంది గృహవిద్యుత్ వినియోగదారులు ఉండగా ఈ పథకం అమలుకు దరఖాస్తులు స్వీకరించిన రాష్ట్ర ప్రభుత్వం వీరిలో అర్హులుగా భావించిన 7.50లక్షల మంది వివరాలను అప్‌లోడ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీఎస్ ఎన్‌పీడీసీఎల్) పరిధిలో మొత్తం 45లక్షల విద్యుత్ కనెక్షన్లున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో 200యూనిట్ల ఉచిత విద్యుత్‌కు అర్హులైనవారు 7.50 లక్షలు ఉన్నట్టు లెక్కతేల్చారు. వీరి దరఖాస్తులను అప్‌లోడ్ చేసి పథకం అమలుకు అన్ని ఏర్పాట్లతో అధికారులు సర్వసన్నద్ధంగా ఉన్నారు. ఎన్‌పీడీసీఎల్ పరిధిలో నెలకు 2,570 మిలియన్ యూనిట్ల విద్యుత్ వాడకం కాగా, ఉమ్మడి జిల్లాలో 777మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగమవు తోంది. హనుమకొండ జిల్లాలో 169.2 మి.యూ, వరంగల్ జిల్లాలో 132.3 మియూ, జనగామ జిల్లాలో 5.750 మియూ, మహబూబాబాద్ జిల్లాలో 3.930 మి.యూ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలుపుకొని 185.1 మియూ విద్యుత్ వాడకమవుతోంది.

అర్హతకు కార్డు సమస్య..

అయితే సబ్సిడీ వంట గ్యాస్‌కు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలుకు ప్రభుత్వం రేషన్‌కార్డు లింక్ పెట్టడంతో ఉమ్మడి 50శాతం ఈ పథకాలను పొందలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో తెల్లరేషన్ కార్డు లేని వారు ఆందోళన చెందుతున్నారు. గత పదేళ్లలో అనేక కుటుంబాల్లోని సభ్యులు వివాహాలతో వేరుపడడం, కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయకపోవడంతో కార్డుల్లేని కుటుంబాల సంఖ్య బాగా పెరిగినట్టు అధికారులు చెబుతున్నారు. ఇదే ఈ రెండు పథకాల అర్హతకు సమస్యగా మారింది. అంతే కాకుండా ప్రధాన మంత్రి ఉజ్వల్ కల్యాణ్ యోజన పథకం లబ్ధిదారులకు ఈ పథకం వర్తిస్తుందా? లేదా? అన్నది కూడా తెలియాల్సి ఉంది.

మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం

గృహజ్యోతి పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం తెల్లరేషన్ కార్డు ఉన్నవారు మాత్రమే ఉచిత కరెంట్‌కు అర్హులు. ఆధార్‌కు రేషన్‌కార్డు అనుసంధానమై ఉండాలి. నెలకు 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే వారికే ఈ పథకం వర్తిస్తుంది. అంటే 2022-23 ఆర్థిక సంవత్సరానికి 2,181యూనిట్లలోపు వాడకం ఉండాలి. ఇక ఇది కూడా ఎలాగంటే ఒక వినియోగదారుడు 1,500యూనిట్లు కరెంట్ వాడితే దానికి 10శాతం కలిపి 12నెలలకు దానికి 10శాతం కలిపి.. ఆ మొత్తాన్ని 12నెలలకు విభజించగా వచ్చిన మొత్తం యూనిట్లకు మాత్రమే ఉచిత పథకానికి వర్తింపజేస్తారు. మిగతాదానికి లెక్క కడతారు. ప్రతీ నెల మీటర్ రీడింగ్‌తో 10 రోజుల పాటు మొదటి వారంలోనే ఉచిత విద్యుత్‌కు లబ్ధిదారుల గుర్తింపు ఉంటుంది. మీటర్ నెంబరుకు రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, మొబైల్ నెంబరు అనుసంధానం చేసి రీడింగ్ తీస్తారు. ఈ విధానంలో కరెంట్ ఉచితంగా ఇచ్చే లబ్ధిదారులను గుర్తించి ఈ పథకాన్ని అమలు చేస్తారు. విద్యుత్ వినియోగం నెలకు 200యూనిట్లు మించినా, బిల్లులు పెండింగ్ ఉన్నా ఈ పథకం వర్తించదు. 2022-23లో సగటున నెలకు 200 యూనిట్లకు మించి విద్యుత్ వాడితే అనర్హులు. గత ఏడాదిలో నెలకు సగటున వాటిన విద్యుత్ అదనంగా 10శాతం మాత్రమే ఉచితం. అనుమతించిన పరిమితికి లోబడి వాడకం ఉంటేనే జీరో బిల్లులు. అదనంగా వాడిన విద్యుత్‌కు బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే ఒక ఇంటికి ఒక మీటర్ ఉన్న వారికే ఈ పథకం అమలవుతుంది. అద్దె ఇళ్లలో ఉన్నవారు కూడా ఈ పథకాన్ని పొందవచ్చు.

పెరగనున్న విద్యుత్ వినియోగం

గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లు ఉచితంగా ఇవ్వనుండడంతో భవిష్యత్తులో విద్యుత్ వినియోగం పెరిగే అవకాశం ఉంది. ఉచితం లేనందు వల్ల ప్రస్తుతం 100 యూనిట్ల వరకే కరెంట్ వాడుకుంటున్న వారు గృహజ్యోతి పథకం అమలైన తర్వాత ఎలాగో ఉచితం కదా అని 200 యూనిట్ల వరకు వాడుకునే అవకాశం లేకపోలేదు. దీనితో విద్యుత్ వినియోగం 20 శాతం వరకు పెరగవచ్చునని విద్యుత్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలో నెలకు 777 మిలియన్ యూనిట్ల కరెంట్ వాడకం అవుతోంది. గృహజ్యోతి పథకం అమలులోకి వచ్చిన తర్వాత అదనంగా మరో 20 శాతం అంటే 155.4 మిలియన్ యూనిట్లు పెరగవచ్చు. దీని వల్ల ప్రస్తుతం ఉన్న కరెంట్ సరఫరా వ్యవస్థపై లోడ్ పెరిగే అవకాశం ఉంది. ఫలితంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగవచ్చు. దీనిని నివారించడానికి భవిష్యత్తులో అదనంగా మరికొన్ని ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం రావచ్చునని ఎన్‌పీడీసీఎల్ అధికారులు భావిస్తున్నారు.

మహాలక్ష్మి అమలవనుందిలా..

మహాలక్ష్మి పథకం కింద రూ.500కు గ్యాస్ సిలిండర్ పొందాలంటే ప్రజాపాలన కింద దరఖాస్తు సమర్పించి ఉండాలి. తెల్లరేషన్ కార్డు తప్పనిసరిగా కలిగి ఉండాలి. ఈ కార్డుదారుని పేరుమీద ఎల్‌పీజీ కనెక్షన్ ఉండాలి. గత మూడు సంవత్సరాల్లో ఆ లబ్ధిదారుడు వినియోగించిన సిలిండర్ల సరాసరి సంఖ్య మేరకు మహాలక్ష్మి పథకం కింద సిలిండర్ల సరఫరా ఆధారపడి ఉంటుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 10,15,335 మంది తెల్లరేషన్ కార్డుదారులున్నారు. వీరిలో వరంగల్ జిల్లాలో 2,72,952 మంది, హనుమకొండ జిల్లాలో 228143, జనగామ జిల్లాలో 1,59,978, మహబూబాబాద్ జిల్లాలో 82392, ములుగు జిల్లాలో 91595, భూపాలపల్లి జిల్లాలో 93501 తెల్లరేషన్ కార్డుదారుడులు ఉన్నారు. వీరందరు సబ్సిడీ గ్యాస్ పొందడానికి అర్హులే.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరణ
- 26 కేంద్రాలు.. హాజరుకానున్న 12,620 మంది విద్యార్థులు...
- హాల్‌టికెట్‌పై ప్రిన్సిపాల్ సంతకం లేకున్నా అనుమతి
- పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికారులు

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 27: నేటి నుంచి ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు పరీక్ష సమయానికంటే అరగంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని డీఐఈవో కాక మాధవరావు సూచించారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను పరీక్షకు అనుమతించరని స్పష్టం చేశారు. జిల్లాలో పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలకు 26 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, ప్రథమ సంవత్సరం 6,164 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సం 6,456 మంది విద్యార్థులు కలిపి మొత్తం 12,620 మంది పరీక్షలు రాయనున్నట్టు వెల్లడించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రశ్న పత్రాలను విడుదల చేయనున్నారు. ఈ పరీక్షలకు ఇంటర్ ఫస్టియర్ జనరల్ గ్రూపుల నుంచి 3,706 మంది, 2,262 మంది, వొకేషనల్ నుంచి 551 విద్యార్థినులు, 275 మంది విద్యార్థులు మొత్తంగా 6,164 మంది పరీక్షకు హాజరవుతున్నారన్నారు.



ఇక ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగం నుంచి 3,071 మంది విద్యార్థినులు, 2,025 మంది విద్యార్థులు, వొకేషనల్ విభాగం నుంచి 603 మంది విద్యార్థినులు, 357 మంది విద్యార్థులు 6,456 మంది మొత్తంగా ఈ ఏడాది 12,620 మంది విద్యార్థులు జిల్లాలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరపు వార్షిక పరీక్షలు రాస్తున్నారు. పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు జరుగకుండా నిరంతర పర్యవేక్షణ కోసం ఒక్క ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాన్ని, రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. వీరితో పాటు ఆకస్మిక తనిఖీలు నిర్వహించేందుకు కలెక్టర్, డీఐఈవో తదితర ప్రత్యేక పరిశీలన బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తుంటాయి. పరీక్షల కోసం 26 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 26 మంది డిపార్ట్‌మెంటల్ అధికా రులతో పాటు మరో 600 మంది వరకు సిబ్బంది విధులు నిర్వర్తించ నున్నారు. విద్యార్థులు పరీక్షలు ప్రశాంతంగా రాయాలని, ఎలాంటి ఆందోళనకు గురికావొద్దని డీఐఈవో కాక మాధవరావు సూచించారు. తల్లిదండ్రులు విద్యార్థులను పరీక్ష కేంద్రాలకు గంట ముందుగానే తీసుకురావాలని కోరారు. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థు లందరికీ హాల్‌టికెట్లు పంపిణీ చేయాలని, విద్యార్థులు నెట్ సెంటర్ల నుంచి డౌన్‌లోడ్ చేసుకొని నేరుగా పరీక్ష రాయవచ్చని పేర్కొన్నారు. హాల్‌టికెట్‌పై సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ సంతకం తప్పనిసరి కాదు, లేకున్నా పరీక్షకు అనుమతి ఉంటుందన్నారు.

ఆత్మకూర్ ఎస్‌ఐపై సస్పెన్షన్ వేటు

ఉత్తర్వులు జారీ చేసిన సీపీ అంబర్ కిషోర్ ఝా


ఎస్‌ఐ ప్రసాద్

హనుమకొండ క్రైం / హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 27 : ఇటీవల ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్ సమ్మక్క సారలమ్మ జాతర సమయంలో జరిగిన ఘర్షణ ఘటన నేపథ్యంలో బీఆర్ఎస్ కార్యకర్తలను అదుపులోకి తీసుకుని థర్డ్ డిగ్రీ ప్రయోగించాడనే ఆరోపణలు ఎదుర్కొంటున్న వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఆత్మకూర్ ఎస్ఐ జి. ప్రసాద్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల అగ్రంపహాడ్ జాతరకు ఈనెల 23న మాజీ ఎమ్మెల్యే చల్లాధర్మారెడ్డి తన అనుచరులతో వెళ్లిన క్రమంలో అధికారులతో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు దురుసుగా ప్రవర్తించారని వచ్చిన ఫిర్యాదుతో సదరు ఎస్ఐ బీఆర్ఎస్ కార్యకర్తలను అదుపులోకి తీసుకుని థర్డ్ డిగ్రీ ప్రయోగించాడనే ఆరోపణలు రావడంతో నిఘా వర్గాలు విచారణ చేపట్టాయి. ఆ విచారణలో ఎస్ఐ థర్డ్‌డిగ్రీ ప్రయోగించిందిన నిజమని తేలడంతో ప్రసాద్‌ను విధులనుంచి తొలగిస్తున్నట్టు సీపీ వెల్లడించారు.

'చలో ఆత్మకూరు'ను విరమించుకుంటున్నాం : చల్లా

పరకాల నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేసి థర్డ్ డిగ్రీ ఉపయోగించిన ఆత్మకూరు ఎస్ఐ ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ సీపీ తీసుకున్న నిర్ణయంతో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తాము బుధవారం చేపట్టిన చలో ఆత్మకూరు కార్యక్రమాన్ని రద్దు చేసుకుంటున్నట్లు మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అగ్రంపహాడ్ జాతరకు తాను వెళ్లిన సమయంలో ఎలాంటి గొడవ జరుగకున్నా పోలీసులు బీఆర్ఎస్ నేతలపై కేసు నమోదు చేయడంపై తాము సీపీని కలిశామని, విచారణ చేసి చర్యలు తీసుకుంటామని సీపీ హామీ ఇచ్చారన్నారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలు ఎవరికి భయపడాల్సిన అవసరం లేదని వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటామని ధర్మారెడ్డి పేర్కొన్నారు.

కమిషనరేట్‌లో ఎస్‌ఐల బదిలీలు

- 12 మందికి స్థానచలనం



హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 27: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న 12 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఎక్కువ కాలం ఒకే చోట విధులు నిర్వర్తిస్తున్న ఎస్ఐలకు స్థానచలనం కల్పించారు. పోస్టింగ్ పొందిన వారు ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో చేరాలని సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశాలు జారీ చేశారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ
ఎస్. రవి	నర్సంపేట	జాఫర్‌గడ్
ఎం. మహేందర్	జాఫర్‌గడ్	నెక్కొండ
షాహిద్ జానీపాష	నెక్కొండ	గీసుగొండ
డి. నరేష్	వీఆర్	రఘునాథ్‌పల్లి
సీహెచ్ రఘుపతి	రఘునాథ్‌పల్లి	ఖానాపూర్
బి. మాధవ్	ఖానాపూర్	నర్సంపేట
గూడ అరుణ్	జనగామ	చెన్నరావుపేట
ఎం. రాజేందర్	వీఆర్	చిల్పూరు
బి. వినయ్‌కుమార్	చిల్పూరు	స్టేషన్ ఘన్‌పూర్
చింత రాజు	నర్సంపేట	లింగాలఘన్‌పూర్
బి. ప్రవీన్‌కుమార్	లింగాలఘన్‌పూర్	వీఆర్
బి. విజయ్‌కుమార్	కేయూ	వీఆర్

అభివృద్ధి పనుల నివేదికను సమర్పించండి

- వేసవి నీటి ప్రణాళికలు సిద్ధం చేయండి
- నాలాల పూడికతీత పనులు చేపట్టాలి
- అధికారులతో మేయర్ గుండు సుధారాణి

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 27 : నగరంలో వివిధ విభాగాల నిధుల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల్లో పూర్తయిన, కొనసాగుతున్న వాటి వివరాలతో నివేదిక సమర్పించాలని ఇంజనీరింగ్ అధికారులను మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. మంగళవారం హనుమకొండలోని బల్దియా ప్రధాన కార్యాలయంలో ఆమె అధికారులతో సమీక్ష జరిపారు. జనరల్ ఫండ్, సీఎం అస్యూరెన్స్, పట్టణ ప్రగతి, 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులతో చేపట్టిన పనులను సమీక్షించారు. చివరి దశలో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కొనసాగుతున్న పనులను త్వరగా ముగించాలన్నారు. వేసవిలో తాగునీటి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. టెయిల్ ఎండ్ ప్రాంతాలకు సైతం నీటి సరఫరా జరగాలన్నారు. లీకేజీలను అరికట్టాలన్నారు. ప్రధాన నాలాలైన భద్రకాళి, వడ్డెపల్లి, రాంనగర్, గుండ్ల సింగారం, దర్గా, భట్టుపల్లి ప్రాంతాల్లో అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణానికి సంబంధించిన టెండర్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. వర్షాకాలం ఆరంభం లోగానే నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. వర్షాకాలానికి ముందే నాలాల పూడికతీత పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బల్దియా ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈలు ఎల్.శ్రీనివాస్‌రావు, రాజయ్య, శ్రీనివాస్, డీఈలు సంతోశ్‌బాబు, సారంగం, రవికిరణ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారు..

- కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్

7


మొదయాత్రలో బండి సంజయ్

కుంగదీసిన అత్తింటివారి వేధింపులు

- అస్వస్థతకు గురై వివాహిత మృతి
- కట్నం కోసం వేధించి, పుట్టింటికి పంపడంతో మనోవేదన
- నిద్రహారాల్లేక లేక ఆరోగ్యం క్షీణించిందంటున్న తల్లిదండ్రులు
- వరంగల్ జిల్లా ఇల్లందలో ఘటన


అర్చన (ఫైల్)

వర్ధన్నపేట రూరల్, ఫిబ్రవరి 27: అదనపు కట్నం కోసం అత్తింటివారు వేధించడమే కాకుండా, తామడిగింది తెస్తేనే తనతో పాటు ఉండాలని, లేదంటే అవసరం లేదని భర్త పుట్టింటికి పంపేయడంతో తీవ్ర మనోవేదనకు గురై నిద్రాహారాలు మానేసిన ఓ మహిళ మృతిచెందింది. ఈ విషాద సంఘటన వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. వర్ధన్నపేట పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలివీ.

ఇల్లంద గ్రామానికి చెందిన బేతి విజయ, వెంకటేశ్వర్లు దంపతులకు కుమారుడు, కుమార్తె కందగట్ల అర్చన(28) ఉన్నారు. విజయ, వెంకటేశ్వర్లు దంపతులు కూలీ పనులు చేసుకుంటూ పిల్లల్ని చదివించాడు. ఈ క్రమంలో అర్చనకు వ్యవసాయశాఖలో ఉద్యోగం వచ్చినా పలుకారణాలతో ఆమె వెళ్లలేదు. ఆ తర్వాత 2022 డిసెంబరు 18న వరంగల్‌లోని కొత్తవాడకు చెందిన కందగట్ల వెంకటయ్య, విజయలక్ష్మి దంపతుల కుమారుడు సందీప్‌కు ఇచ్చి వివాహం చేశారు. ఆ సమయంలో అర్చన తల్లిదండ్రులు రూ.8లక్షలు కట్నం ఇచ్చారు. ఇక సందీప్ హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తూ భార్యతో కలిసి అక్కడే నివాసం ఉంటున్నాడు. పెళ్లయిన నెల రోజుల పాటు వారి సంసార జీవనం బాగానే సాగింది. ఆ తర్వాత నుంచి తనకు అదనపు కట్నం కావాలంటూ సందీప్ తనను ఇబ్బంది పెడుతున్నాడని ఎప్పటికప్పుడు అర్చన తన తల్లికి చెప్పేది. సెలవులు, పండుగల సమయాల్లో తాము వరంగల్‌లోని అత్తమామల వద్దకు వచ్చిన సందర్భాల్లోనూ తనను భర్తతోపాటు అత్తమామలు కూడా వేధించేవారని తల్లితో ఫోన్‌లో వాపోయేది. ఈ నేపథ్యంలోనే ఈనెల 25న సందీప్ తన అత్తమామలకు ఫోన్ చేసి తనకు అదనపు కట్నం ఇస్తేనే అర్చన తన ఇంట్లో ఉండాలని, లేకుంటే తీసుకెళ్లాలని చెప్పడంతో.. ఆందోళన చెందిన విజయ, వెంకటేశ్వర్లు దంపతులు మరుసటి రోజు సోమవారం వెళ్లి తమ కూతురిని ఇల్లందకు తీసుకొచ్చారు. అప్పటికే మానసికంగా కుంగిపోయి, నిద్రాహారాలు సరిగా లేకుండా ఉన్న అర్చన.. సోమవారం రాత్రి అపస్మారక స్థితికి చేరుకుంది. దీంతో అర్చనను వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే అర్చన మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. తమ కూతురు మృతికి అత్తింటివారి వేధింపులే కారణమని, అర్చన మృతిపై తమకు అనుమానాలున్నాయని తల్లి విజయ ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వర్ధన్నపేటలోని పోస్టుమార్టం గది వద్ద వర్ధన్నపేట తహసీల్దార్ విజయ్ సాగర్, సీఐ సూర్యప్రకాష్ మృతురాలి తల్లి వాంగ్మూలాన్ని తీసుకున్నారు.

రోడ్ సేఫ్టీపై అవగాహన కల్పించాలి

- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి
- రోడ్డు సేఫ్టీ అథారిటీ కమిటీ సమావేశంలో కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 27: రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని లైన్ డిపార్ట్‌మెంట్లు ఒక యాక్షన్ ప్లాన్‌తో ముందుకు వెళ్లి, వాహనదారులకు అవగాహన కల్పించాలని కలెక్టర్, రోడ్డు సేఫ్టీ అథారిటీ చైర్మన్ పి.ప్రావీణ్య అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో రోడ్డు సేఫ్టీ అథారిటీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు సేఫ్టీ ఉత్సవాల్లో వివిధ శాఖల వారు ఏర్పాటు చేసిన డాక్యుమెంటరీ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని, ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని నివారణ చర్యలు చేపట్టాలన్నారు. రాబోయే రోడ్డు సేఫ్టీ వారోత్సవాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రోడ్లపై ప్రమాదాలు జరుగకుండా స్పీడ్ బ్రేకర్లు, రోడ్డుకు ఇరువైపులా హెచ్చరిక బోర్డులు ఉంచాలని అధికారులను ఆదేశించారు. రద్దీ ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో వాహనాల వేగాన్ని నియంత్రించుటకు డబుల్స్ స్టిక్స్‌ను ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ

మిగతా 8వ పేజీలో..



నాలుగేళ్ల తర్వాత..

- ఎల్ఆర్ఎస్‌కు గ్రీన్‌సిగ్నల్‌తో కసరత్తుకు సిద్ధమైన బల్దియా, 'కుడా'
- సుమారు లక్ష దరఖాస్తులకు కదలిక
- బల్దియా పరిధిలో 98 వేలకు పైగా దరఖాస్తులు
- 'కుడా'లో 2వేల వరకు అప్లికేషన్లు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 27 : ఎట్టకేలకు ఎల్ఆర్ఎస్‌కు మోక్షం లభించనుంది. లే-అవుట్ల క్రమబద్ధీకరణకు కాంగ్రెస్ సర్కార్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో దాదాపు నాలుగేళ్లుగా కోల్డ్ స్టోరేజీలో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు కదలిక రానుంది. ఆదాయ వనరుల సమకూర్పు లక్ష్యంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో దేవాదాయ, వక్ఫ్, ప్రభుత్వ భూములు, కోర్టు పరిధిలో ఉన్న భూములకు మినహాయించి ప్రభుత్వం ప్రకటించిన ఎల్ఆర్ఎస్ స్కీమ్ వర్తించనుంది. 2020లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ పథకాన్ని ప్రకటించింది. వ్యక్తిగత స్థలాలకు రూ.1000, లే-అవుట్లకు రూ.10వేల ఫీజు నిర్ణయించి స్థలాల యజమానుల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. ఫీజులకు స్లాట్‌లను విధించి.. 100 గజాలు, 300 గజాలు, 300 నుంచి 400 గజాలు ఆపై స్లాట్‌లతో ఫీజులను నిర్ణయించింది.

సుమారు లక్ష దరఖాస్తులకు మోక్షం..

2020లో ఎల్ఆర్ఎస్ స్కీమ్ ప్రకటనతో దరఖాస్తుల సమర్పణ అధిక సంఖ్యలోనే జరిగింది. 2020కి ముందు నగరంతో పాటు, కుడా పరిధిలోని 183గ్రామాల ఎల్ఆర్ఎస్ ప్రక్రియ అంతా కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలోనే జరిగేది. అయితే నాటి బీఆర్ఎస్ సర్కార్ తీసుకొచ్చిన పాలన పరమైన మార్పుల్లో నగర పరిధిలోని స్థలాలకు ఎల్ఆర్ఎస్ ప్రక్రియ కార్పొరేషన్లకు మారింది. ఈ క్రమంలో వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధి(బల్దియా)లోని డివిజన్ల స్థలాలు, లే-అవుట్ల ఎల్ఆర్ఎస్ విధానం 2020లో అమల్లోకి వచ్చింది. ఈ క్రమంలో వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలో సుమారు 98లక్షల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు సమర్పితమయ్యాయి. ఇందులో వ్యక్తిగత స్థలాలతో పాటు, లే-అవుట్ స్థలాలు కూడా ఉన్నాయి. ఇక కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) పరిధిలో సుమారు 2వేల వరకు దరఖాస్తులు వచ్చినట్లు అంచనా. మొత్తంగా లక్ష వరకు దరఖాస్తులు సమర్పితమైనట్లు అధికారులు చెబుతున్నారు. వ్యక్తిగత స్థలాలకు రూ.వెయ్యి, లే-అవుట్ స్థలాల క్రమబద్ధీకరణ కోసం రూ.10వేల ఫీజులతో యజమానులు దరఖాస్తులను సమర్పించారు. 2020 అక్టోబరు 15 వరకు దరఖాస్తుల గడువు ముగిసింది. ఇక ప్రభుత్వం వెనువెంటనే దరఖాస్తులను పరిశీలించి సర్వేలు జరిపి ఆ మేరకు మొత్తం ఫీజుల చెల్లింపుతో ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్స్ జారీ చేస్తుందని దరఖాస్తుదారులు ఆశించారు. కానీ దరఖాస్తుల సమర్పణ ప్రక్రియతోనే బ్రేక్ పడింది. తాజాగా కాంగ్రెస్ సర్కారు ఎల్ఆర్ఎస్‌పై ప్రకటన చేయడంతో బల్దియా, కుడా పరిధిలో సమర్పితమైన సుమారు లక్ష ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు చలనం కలుగనుంది. బల్దియా, కుడా పరిధిలో సమర్పితమైన దరఖాస్తుల ల్యాండ్ రెగ్యులరైజేషన్ ద్వారా రూ.250 కోట్లకు పైగానే నిధులు సమకూరుతాయనే అంచనా.

విధి, విధానాలు రావాల్సి ఉందంటున్న అధికారులు

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఎల్ఆర్ఎస్ స్కీమ్‌కు సంబంధించి పూర్తి స్థాయిలో విధి, విధానాలు రావాల్సి ఉందని బల్దియా, కుడా అధికారులు చెబుతున్నారు. ఇప్పుడే మార్గ దర్శకాలను పూర్తిగా వెల్లడించలేమంటున్నారు. అయితే 2020లో అందిన దరఖాస్తుల్లో ఇప్పటికే 15వేల వరకు భూముల సర్వే జరిపినట్లు బల్దియా అధకారులు చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి మార్గ దర్శకాలు వచ్చాక ఆ దరఖాస్తులన్నింటిని పరిశీలించి ఆ స్థలాలను సర్వే జరిపిస్తామంటున్నారు. ఈ విషయమై పూర్తి సమాచారాన్ని విధి, విధానాల స్పష్టత తరువాత యజమానులకు తెలియచేస్తామంటున్నారు.

ఎంజీఎం అవినీతిపై ఏసీబీ నజర్?

కీలక సెక్షన్లు మార్చకపోవడంపై ఆరా

సాధారణ మందులు కూడా కరువు



హనుమకొండ, ఫిబ్రవరి 27 : ఎంజీఎం పరిపాలనపై ఏసీబీ నజర్ వేసినట్లు తెలుస్తోంది. గత కొంతకాలంగా బోధన ఆస్పత్రుల్లో అవినీతి అక్రమాలపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఈలోగా ఎంజీఎం పరిపాలన విభాగం లో అంతర్గత బదిలీలు గత రెండు రోజుల క్రి తం నిర్వహించారు. దీర్ఘకాలికంగా ఒకే సెక్షన్‌లో తిష్టవేసిన వారిని యథాస్థితిలో కొనసాగించడంపై అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. రెండు దశాబ్దాల కాలంగా పేషీలో తిష్టవేసిన మినిస్ట్రియల్ సిబ్బందితోపాటు కీలక ఆదాయ వనరులు ఉన్న పలు సెక్షన్లు మార్చకపోవడంపై విస్మ యం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం మారిన ఎంజీఎంలో కొందరి హవా ఎప్పటిలా గే కొనసాగుతోందని సహచర ఉద్యోగులు కూ డా వాపోతున్నారు. స్టేషనరీ కొనుగోలు లాం టి ఆదాయ వనరులు ఉన్న అనేక సెక్షన్లలో గత కొన్ని సంవత్సరాలుగా ఆడిట్ జరగడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఇందుకు ఉన్నతాధికారుల సహకారమే ప్రధాన కారణమని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎంజీఎం ఆస్పత్రిలో పాంటాప్ లాంటి సాధారణ మా త్రలు కూడా ప్రస్తుతం అందుబాటులో లేకపోవడం పరిపాలనకు నిలువెత్తు నిదర్శనంగా మారింది.

క్రిమిసంహారక మందుతాగి వచ్చే రోగుల కోసం ఏబీజీ పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. గత కొన్ని నెలలుగా ఈ పరీక్షలకు ఎంజీఎం వైద్యులు స్వస్తి పలికారు. ఫలితంగా రోగుల ప్రాణాలు గాలిలో దీపంగా మారాయి. నిధులు మింగుతూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న సెక్షన్లలో ఇప్పటికైనా ప్రక్షాళన చేయాలన్న డిమాండ్ వ్యక్తం అవుతోంది. ఇటీవలే ఉమ్మడి నల్గొండ జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ మం దులు సప్లై చేసే కాంట్రాక్టర్ నుంచి పెద్ద మొ త్తంలో లంచాలు స్వీకరిస్తూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన విషయం తెలిసిందే.

జిల్లా ఫారెస్టు డివిజన్ అధికారిగా అనూజ్ అగర్వాల్

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 27: రాష్ట్ర వ్యాప్తంగా బదిలీ ల్లో భాగంగా వరంగల్ జిల్లా ఫారెస్టు డివిజనల్ అధికారిగా ఐఎఫ్ఎస్ అధికారి అనూజ్ అగర్వాల్‌ను నియమించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవా రం ఉత్తర్వులు జారీ చేశారు. ఏటూర్ నాగారంలో విధులు నిర్వహిస్తున్న అగర్వాల్ వరంగల్‌కు బదిలీపై రాగా, ఇక్కడ పనిచేస్తున్న అపర్ణ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు.

ఎల్ఆర్ఎస్‌పై కాంగ్రెస్ మాట తప్పింది

- ఫీజు లేకుండా క్రమబద్ధీకరించాలి
- తాగునీటిలోనూ లాభం వెతుకుతారా?
- ఇలాంటి వ్యక్తి సీఎం కావడం దురదృష్టకరం
- ప్రభుత్వమంటే రియల్ వ్యాపారం కాదు: హరీశ్



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి రాగానే ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేస్తామని, ఉచితంగా స్థలాలను క్రమబద్ధీకరిస్తాం అంటూ ప్రజలను రెచ్చగొట్టిన కాంగ్రెస్.. ఇపుడు మాట తప్పి ఫీజు వసూలు చేసేందుకు సిద్ధమైందని మాజీ మంత్రి టి.హరీశ్ రావు ఆరోపించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో మంగళవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని, లేదంటే మోసపూరిత హామీ ఇచ్చినందుకు ప్రజలకు కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హామీల అమలుపై మాట మార్చడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని.. ఇది వారి మోసపూరిత విధానాలకు నిదర్శనమని విమర్శించారు. ఆ పార్టీ నేతలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. గతంలో చేసిన ప్రకటనలకు అనుగుణంగా ఎల్ఆర్ఎస్‌ను ఎలాంటి ఫీజులు లేకుండా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు..ప్రజలకు అందించే స్వచ్ఛమైన తాగునీటిలోనూ లాభం వెతుకుతారా..? మిషన్ భగీరథ పథకంలో లాభం వెతికే వ్యక్తి ముఖ్యమంత్రి కావడం మన దురదృష్టమని హరీశ్‌రావు పేర్కొన్నారు. భగీరథ ద్వారా ఏం లాభం తెచ్చారని.. దానికోసం తెచ్చిన అప్పుపై వడ్డీ ఎలా కడతారని ఆయన ప్రశ్నించడం అంతకన్నా దౌర్భాగ్యం, భావదారిద్ర్య ఆరోపణ మరొకటి ఉండద మంగళవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వమంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం కాదు.. ప్రజా సంక్షేమంలో లాభనష్టాలు చూసుకోరని రేవంత్‌రెడ్డిపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. మిషన్ భగీరథ పథకాన్ని ప్రజల ఆరోగ్యం కాపాడిన గొప్ప సంజీవనిగా చూడాలని.. అందులో లాభనష్టాలు బేరీజు వేసుకోవడం ఒక ప్రభుత్వాధినేతకు తగదని హితవుపలికారు. ఆసరా పెన్షన్ల ద్వారా కూడా రూ.వేలకోట్లు ఖర్చవుతుంది. దాని వల్ల కూడా లాభం లేదంటారా..? అని ప్రశ్నించారు.

మీ ఎత్తు గురించి నేను మాట్లాడితే..!

'ఇటీవల పలు సందర్భాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిసారి నా ఎత్తు గురించి వ్యాఖ్యానిస్తున్నారు. నేను కూడా మీ (సీఎం రేవంత్‌ను ఉద్దేశించి) ఎత్తు గురించి మాట్లాడితే సంస్కారవంతంగా ఉండదు. ఎవరి ఎత్తు ఎంత అనేది ప్రజలకు అవసరం లేదు. ప్రజల కోసం ఎవరు ఎంతమేరకు ఆలోచిస్తున్నారో.. ఎవరెంత పనిచేస్తున్నారో.. మాత్రమే వారికి అవసరం' అని హరీశ్‌రావు వెల్లడించారు.

కాంగ్రెస్ వస్తే ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తామన్నారు కదా?: టీఆర్ఏ

ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్న ముఖ్యమంత్రితోపాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తామని ప్రకటనలు చేశారని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ (టీఆర్ఏ) అధ్యక్షుడు నారగోని ప్రవీణ్ కుమార్ గుర్తు చేశారు. "గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ కింద రుసుము వసూలుకు ప్రతిపాదనలు చేస్తే.. లేఅవుట్ రెగ్యులేషన్ స్కీమ్ లాగే మ్యారేజ్ రెగ్యులేషన్ స్కీమ్ కూడా తీసుకొస్తారేమో అని గతంలో రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఇప్పుడేమో సీఎం హోదాలో అదే పథకాన్ని అమలు చేసేందుకు రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఎల్ఆర్ఎస్ రద్దు చేయాలని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేయగా గతంలో కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. ఇప్పుడు ఇదే ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ తెరమీదకు తెచ్చి మార్చి 31లోగా గడువు విధించి రెగ్యులరైజేషన్ చేయించుకోవాలని చెప్పడం సమంజసంగా లేదు" అని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తెలంగాణలో 17 సీట్లూ బీజేపీ గెలవాలి

హైదరాబాద్ సీటును కూడా కైవసం చేసుకోవాలి.. అసదుద్దీన్ పార్లమెంటుకు వెళ్లకుండా అడ్డుకోవాలి

- విజయ సంకల్ప యాత్రలో కిషన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ/కార్వాన్/నిజామాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాల్లోనూ బీజేపీ గెలవాలని, మజ్లిస్ సీటును కూడా కైవసం చేసుకుని అసదుద్దీన్ ఒవైసీ పార్లమెంటుకు వెళ్లకుండా అడ్డుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజాసామ్యానికి, అభివృద్ధికి వ్యతిరేకంగా మజ్లిస్ పార్టీ పనిచేస్తుందని, మెట్రో రైలు ప్రాజెక్టును అడ్డుకుంటుందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే దాని పంచన చేరి పోలీసు వ్యవస్థను తన ఆధీనంలో పెట్టుకుంటుందని విమర్శించారు. మంగళవారం కిషన్ రెడ్డి హైదరాబాద్‌లో రెండో రోజు విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. గుడిమల్కాపూర్ జైన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్వాన్, గోషామహల్, చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో యాత్ర కొనసాగింది. జుమ్మేరాత్ బజార్‌లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. బీజేపీకి ముఖ్యంగా హైదరాబాద్ లోక్‌సభ సీటు గెలవాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పాలనలో 12 లక్షల కోట్ల అవినీతి జరిగిందని, మోదీ ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా పాలన కొనసాగిస్తున్నారన్నారు. ప్రపంచంలో భారతదేశ ప్రతిష్ఠను పెంచారన్నారు. రాష్ట్రంలో 17 లోక్‌సభ, 114 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 5500 కిలోమీటర్ల మేర ఐదు విజయ సంకల్ప యాత్రలు కొనసాగుతాయని తెలిపారు. వచ్చే నెల 2వ తేదీతో ముగుస్తాయన్నారు. మోదీ మళ్లీ ప్రధాని కావాలని ఈ యాత్రలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కాగా, నిజామాబాద్ జిల్లా బాల్కొండ, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్ నియోజకవర్గాల్లో జరిగిన యాత్రలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పాల్గొన్నారు. కేంద్రంలో మూడోసారీ బీజేపీయే అధికారంలోకి వస్తుందని, మోదీ మళ్లీ ప్రధాని అవుతారని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మోదీ రైతుల కోసం పసుపు బోర్డు ఏర్పాటు చేసి హామీ నెరవేర్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ నామమాత్ర మెజారిటీతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పటికీ ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్‌కు ఆదరణ లేదని, కేంద్రంలో ఆ పార్టీ అధికారంలోకి రావడం కలేనని వ్యాఖ్యానించారు.



విజయ సంకల్ప యాత్రలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న దృశ్యం

తల్లిని అడ్డు పెట్టుకొని రాజకీయాలు

పొన్నం తల్లిని నేను అవమానించలేదు.. యాత్రను ఆపేయాలనుకుంటే కాంగ్రెస్‌కే నష్టం

- హామీల అమలును ప్రశ్నిస్తే దాడులా?
- నేను ఓడిపోతే.. రాజకీయ సన్యాసం
- కాంగ్రెస్ ఓడితే పొన్నం తప్పుకుంటారా?
- కేటీఆర్‌తో బీఆర్ఎస్..

పొన్నంతో కాంగ్రెస్ నాశనం: సంజయ్

హుస్నాబాద్, ఫిబ్రవరి 27: కన్న తల్లిని అడ్డుపెట్టుకొని మంత్రి పొన్నం ప్రభాకర్ రాజకీయం చేయాలనుకుంటున్నాడని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ విమర్శించారు. 'రాముడు అయోధ్యలోనే పుట్టాడా..?' అని అడిగిన వారిని ప్రశ్నించాను తప్ప.. పొన్నం తల్లిని ఉద్దేశించి అనలేదని వివరణ ఇచ్చారు. అందరు తల్లులు తన తల్లితో సమానమని.. ప్రభాకర్ తల్లిని తాను అవమానించలేదని స్పష్టం చేశారు. తాను అంత సంస్కారహీనుడిని కానని అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో జరిగిన ప్రజాహిత యాత్ర బహిరంగ సభలో సంజయ్ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చేలోగా కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే.. అడుగడుగునా నిలదీస్తూనే ఉంటామని హెచ్చరించారు. హామీల అమలుకు ఇంకా 20 రోజులే గడువు ఉందన్నారు. రేషన్ కార్డులు ఉన్న వారికే పథకాలు ఇస్తామని చెబుతున్నారని.. రేషన్ కార్డులు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. తాను హామీల అమలును ప్రశ్నిస్తే.. కాంగ్రెస్ దాడులు చేయించడం ఏంటని ప్రశ్నించారు. పొన్నం ప్రభాకర్ ఏమీ చేయలేదు కాబట్టే గత ఎంపీ ఎన్నికల్లో మూడో స్థానం వచ్చిందని తెలిపారు. అయోధ్య అక్షింతలను రేషన్ బియ్యం అని ఆయన అన్నది వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. ప్రజాహిత యాత్రను ఆపాలనుకుంటే కాంగ్రెస్‌కే నష్టమని హెచ్చరించారు. కేసీఆర్ పదేళ్లలో రూ.5 లక్షల కోట్ల అప్పు చేస్తే, కాంగ్రెస్ 2 నెలల్లో రూ.10వేల కోట్ల అప్పు చేసిందని విమర్శించారు. తల్లిని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నందుకు స్వర్గంలో ఉన్న పొన్నం తల్లి ఆత్మ ఎంత క్షోభిస్తుందోనని సంజయ్ అన్నారు. అయితే, పక్కనే ఉన్న నాయకులు పొన్నం తల్లి బతికే ఉందని.. తండ్రి చనిపోయాడని తెలిపారు. దీంతో పొరపాటును గుర్తించిన సంజయ్.. పొన్నం తండ్రి ఆత్మ ఎంత క్షోభిస్తుందోనని అన్నారు. ఆయన తల్లి నూరేళ్లు ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. 'రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రికి సవాల్ విసురుతున్నా.. నేను నా విశ్వాసాలతో రాముడి పేరిట ఎంపీ ఎన్నికల్లో నిలుచుంటా. నువ్వు నీ వాదనతో అభ్యర్థిని నిలబెట్టు. నేను ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా. మళ్లీ రాముడని, హిందూ మతమని మాట్లాడను. మీ అభ్యర్థి ఓడితే రాజకీయాల నుంచి తప్పుకుంటావా..?' అని బండి సంజయ్ పేర్కొన్నారు. కేటీఆర్‌తో బీఆర్ఎస్ నాశనమైందని, పొన్నం లాంటి వారితో కాంగ్రెస్ నాశనమవుతుందని పేర్కొన్నారు. 'కేంద్ర ప్రభుత్వం ఉచితంగా రేషన్ బియ్యం ఇస్తుంటే మీ ఫొటోలు పెట్టుకుంటారా.. తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వమే ఉచితంగా బియ్యం ఇస్తోందని, ఇక్కడికి బియ్యం పంపవద్దని ప్రధాని మోదీకి లేఖ రాస్తా' అని అన్నారు.



ప్రజాహిత యాత్ర బహిరంగ సభలో సంజయ్

సంజయ్ క్షమాపణ చెప్పాలి

కాంగ్రెస్ శ్రేణుల డిమాండ్

పాదయాత్ర శిబిరాన్ని ముట్టడించే యత్నం

చిగురుమామిడి/హుస్నాబాద్ రూరల్: సంజయ్ చేపట్టిన ప్రజాహిత యాత్ర మంగళవారం ఉద్రిక్త వాతావరణంలో సాగింది. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని హుస్నాబాద్ కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. సంజయ్ ప్రజాహిత యాత్రను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లిలో సోమవారం రాత్రి సంజయ్ బస చేశారు. మంగళవారం ఉదయం అక్కడికి తరలి వచ్చిన కాంగ్రెస్ నాయకులు సంజయ్ బస చేసిన శిబిరాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. అక్కడ ఉన్న బీజేపీ నాయకులు వారిని ప్రతిఘటించారు. పోలీసులు ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. దీంతో ఉల్లంపల్లి శివారులోని ప్రధాన రహదారిపై కాంగ్రెస్ కార్యకర్తలు బైఠాయించారు. కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కరీంనగర్ జిల్లా సరిహద్దు నుంచి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని రాములపల్లి వరకు పాదయాత్రను పోలీస్ బందో బస్తుతో తీసుకెళ్లారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. కరీంనగర్‌లో రాస్తారోకో చేశారు. పలుచోట్ల సంజయ్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఎంపీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాహిత యాత్ర మంగళవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలానికి వస్తున్న క్రమంలో సంజయ్‌కి స్వాగతం పలుకుతూ బీజేపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై కాంగ్రెస్ కార్యకర్తలు అనుచిత రాతలు రాశారు. దీనిపై బీజేపీ నేతలు ముల్కనూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యాత్ర పేరిట 'బండి' రాజకీయ డ్రామాలు

- నా తల్లిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు
- ఎంపీగా అయిదేళ్లలో ఏం చేశారో చెప్పాలి
- సంజయ్ ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడు : మంత్రి పొన్నం



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి)/హుస్నాబాద్: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ రాజకీయ డ్రామాలతో ప్రజాహిత యాత్ర చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆయన గాంధీ భవన్‌లో, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. తన తల్లిపై బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఎంపీగా ఐదేళ్ల పదవీ కాలంలో సంజయ్ కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నిస్తే.. ఆయన తన తల్లి జన్మకు సంబంధించి వ్యాఖ్యలు చేశారని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేవలం ప్రచారం కోసమే సంజయ్ తన యాత్రను కాంగ్రెస్ అడ్డుకున్నట్లు డ్రామాలకు తెరలేపారన్నారు. తాము వాళ్ల యాత్రలు అడ్డుకోవడం లేదని, ప్రజాస్వామ్యంలో యాత్ర చేసే హక్కు అందరికీ ఉంటుందని, కానీ అవివేకమైన మాటలు సరికాదని విమర్శించారు. తనకు శ్రీరాముడు అంటే గౌరవం అని, ఏనాడు శ్రీరాముడి గురించి కాని, అక్షింతల గురించి గాని మాట్లాడలేదని, ఒకవేళ మాట్లాడినట్లు నిరూపిస్తే సజీవ సమాధికి సిద్ధమని సవాల్ విసిరారు. తన మాటలను వక్రీకరించి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. శ్రీరాముని పేరు మీద ఓట్లు అడగడం కాదు.. అయిదేళ్ల కాలంలో కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ నియోజకవర్గ ప్రజలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సంజయ్ వ్యాఖ్యలపై బీజేపీ కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలు ఆలోచించాలన్నారు. ఇలాంటి నాయకుని డ్రామాలను సమర్థిస్తున్నారా..? అని ప్రశ్నించారు. సంజయ్ ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని మంత్రి హెచ్చరించారు.

మేడారంలో నేడు తిరుగువారం

పండుగ కోసం ఏర్పాట్లు చేస్తున్న పూజారులు



వనదేవతల గద్దెలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారం, ఫిబ్రవరి 27 : మహా జాతర ముగిసిన అనంతరం సంప్రదాయంలో భాగంగా తాడ్వాయి మండలం మేడారంలో బుధవారం తిరుగువారం పండుగ ఘనంగా జరుగనుంది. ఈ నేపథ్యంలో పూజారులు గుడులు, గద్దెలను శుభ్రపరిచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గుడులలో, గ్రామ దేవతలకు పూజారులు డోలు వాయిద్యాల మధ్య ప్రత్యేక పూజలు చేసి తలనీలాలు సమర్పించి, యాట మొక్కులు చెల్లించుకుంటారు. మహాజాతర ముగిసిన అనంతరం దేవతల పూజా సామగ్రిని శుద్ధి చేసి గుడులలో అటకపై దాచి పెడుతారు. అదేవిధంగా ఆదివారం వనభోజనాలకు వెళ్లి మహాజాతర తంతును ముగిస్తారు.

తల్లుల చెంతకు కొనసాగుతున్న భక్తుల రాక

తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో మేడారం తరలొస్తున్నారు. జాతరముగిసినా మంగళవారం వేలాది మంది భక్తులు తల్లుల గద్దెలకు చేరుకుని పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరసారెలు, కొబ్బరికాయలు, బెల్లం సమర్పించుకుంటున్నారు. పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటున్నారు. మంగళవారం సుమారు 10వేల మంది భక్తులు తల్లులను దర్శించుకున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

గుండెపోటుతో సమ్మక్క పూజారి మృతి



మృతి చెందిన పూజారి ధశరథం

మేడారం, ఫిబ్రవరి 27: తాడ్వాయి మండలం మేడారంలోని వనదేవత సమ్మక్క పూజారి సిద్దబోయిన దశరథం మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సమ్మక్క పూజారి దశరథం కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మంగళవారం ఉదయం గుండెనొప్పి రావడంతో హనుమకొండకు చెందిన ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో దశరథం మృతిచెం దాడని వైద్యులు నిర్ధారించారు. దశరథం మృతితో గ్రామ ప్రజలు, బంధుమిత్రులు సంతాపాన్ని తెలిపారు. సమ్మ క్క పూజారి మృతికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రగాఢ సానుభూతి తెలిపారు. పలువు రు పూజారులు, ఆదివాసీ సంఘాల నాయకులు సంతాపం తెలిపారు.

ఉపాధి కార్యాలయంలో 29న జాబ్ మేళా

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 27: హనుమకొండ ములుగురోడ్‌లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 29న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.మల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ కంపెనీ జేఎస్ఆర్ గ్రూప్ సన్‌సిటీ రియాలిటీ ప్రైవేట్ లిమిటెడ్‌లో 50 ఉద్యోగాల ఎంపికకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ చదివిన 18 నుంచి 50 సంవత్సరాల వయస్సుగల నిరుద్యోగ యువతీ యువకులు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో ఉపాధి కల్పన కార్యాలయానికి ఉదయం 11 గంటల వరకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 98488 95937 సంప్రదించాలని తెలిపారు.

బండి సంజయ్ ఫ్లెక్సీపై అనుచిత రాతలు

మంత్రి పొన్నంపై వ్యాఖ్యలకు కాంగ్రెస్ కార్యకర్తల నిరసన

కాంగ్రెస్ నాయకులపై ఫిర్యాదు చేసిన బీజేపీ నాయకులు

పాదయాత్ర, కొత్తకొండలో బస చేసే ప్రాంతంలో పటిష్ఠ బందోబస్తు

డీసీపీ నేతృత్వంలో పోలీసుల మోహరింపు



కొత్తకొండ హరిత హోటల్ వద్ద బందోబస్తు ఏర్పాట్ల పరిశీలనలో డీసీపీ బారి



పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులపై ఫిర్యాదు చేస్తున్నబీజేపీ నాయకులు

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 27 : ప్రజాహిత పాదయాత్రలో భాగంగా మంగళవారం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలానికి వస్తున్న క్రమంలో తీవ్ర దుమారం రేగింది. బండి సంజయ్ పాదయాత్రను పురస్కరించుకుని బీజేపీ నాయకులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అయితే బండి సంజయ్.. తమ నాయకుడు, మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ నాయకులు కట్టిన ఫ్లెక్సీలపై అనుచిత రాతలు రాశారు. దీనిపై తీవ్రంగా స్పందించిన బీజేపీ మండలాధ్యక్షుడు పైడిపల్లి పృథ్వీరాజ్‌గౌడ్‌తో పాటు పలువురు నాయకులు.. తమ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ఫ్లెక్సీపై కాంగ్రెస్ నాయకులు అసభ్యకర రాతలు రాశారని, వారిపై కేసు నమోదు చేయాలని ముల్కనూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీజేపీ నాయకులు తమ ఫిర్యాదులో కాంగ్రెస్ నాయకులు కొల్గూరి రాజు, ఆదరి రవీందర్, మాడ్గుల కిరణ్, సుతారి రాజమౌళి, మాచర్ల కుమారస్వామి, తదితరుల పేర్లను చేర్చారు.

కొత్తకొండలో హైటెన్షన్

బీజేపీ ఎంపీ బండి సంజయ్‌కుమార్ పాదయాత్ర నేపథ్యంలో జరిగిన పరిణామాలను దృష్టిలో పెట్టుకుని పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలో పాదయాత్ర సందర్భంగా బండి సంజయ్.. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమంటున్నాయి. మంగళవారం ఉదయం హుస్నాబాద్ మండలం రాములపల్లిలో సంజయ్ పాదయాత్రపై కాంగ్రెస్ కార్యకర్తలు రాళ్ల దాడి చేశారని బీజేపీ నాయకులు పేర్కొంటున్నారు. దీంతో బీజేపీ, కాంగ్రెస్ శ్రేణుల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే భీమదేవరపల్లి మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కొందరు సంజయ్ పాదయాత్రను అడ్డుకునేందుకు మంగళవారం ఉదయం తరలివెళ్లారు. ఆ సమయంలో అక్కడ కాంగ్రెస్ నాయకులపై బీజేపీ నాయకులు దాడి చేయగా.. తమ పైనే దాడి చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన కాంగ్రెస్ నాయకులు మంగళవారం రాత్రి భీమదేవరపల్లి మండలంలో బండి సంజయ్ పాదయాత్ర ఎలా చేస్తారో చూస్తామంటూ హెచ్చరించారు. ఈ విషయం తెలుసుకున్న సీపీ అంబర్ కిశోర్‌ఝా డీసీపీకి బందోబస్తుపై ఆదేశాలిచ్చారు. దీంతో డీసీపీ బారీ, ఏసీపీ తిరుమల్ నేతృత్వంలో సుమారు 300మందికి పైగా పోలీసులు బందోబస్తులో నిమగ్నమయ్యారు. మంగళవారం రాత్రి 10గంటల తర్వాత సిద్దిపేట జిల్లా నుంచి హనుమకొండ జిల్లా మల్లారం గ్రామం చేరుకుంటుందని సమాచారం అందడం, అనంతరం బండి సంజయ్ కొత్తకొండ హరితహోటల్‌లో బస చేయనుండగా.. ఆయా ప్రాంతాల్లో పోలీసులు మోహరించారు. దీంతో కొత్తకొండలో టెన్షన్ మొదలైంది. మరోవైపు బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మధ్య మాటలయుద్ధం జరుగుతుండటం, ఫ్లెక్సీలపై రాతల వివాదం ఏర్పడిన నేపథ్యంలో పరిస్థితి అదుపుతప్పితే అవసరమైతే బండి సంజయ్‌ను అరెస్టు చేస్తారన్న ప్రచారం జరిగింది. దీంతో సిద్దిపేట, కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి బీజేపీ శ్రేణులు పాదయాత్ర ప్రాంతానికి భారీగా తరలివచ్చారు. హనుమకొండ బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ మంగళవారం రాత్రి కొత్తకొండకు చేరుకున్నారు.

మోదీ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారు..

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్



మల్లారంలో పాదయాత్ర చేస్తున్న బండి సంజయ్

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 27: ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని దేశ ప్రజలు కోరుకుంటున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. మంగళవారం రాత్రి సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం నుంచి ఆయన ప్రజాహిత పాదయాత్ర భీమదేవరపల్లి మండలం మల్లారం, కొత్తకొండ గ్రామాలకు చేరుకుంది. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం కొత్తకొండలో ఆయన మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో దేశం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పిందని, కానీ 80 రోజులు పూర్తయ్యాయని, ఒకటి, రెండు గ్యారెంటీలు అమలు చేసి మిగత గ్యారెంటీలకు మొండిచేయి చూపించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ మరో 15 రోజుల్లో వచ్చే అవకాశం ఉందని, ఆలోపే మిగతా గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, హుస్నాబాద్ నియోజక వర్గ ఇన్‌చార్జ్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి, నాయకులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, భీమదేవరపల్లి మండల అధ్యక్షులు పైడిపెల్లి పృథ్వీరాజ్‌గౌడ్, జిల్లా కార్యదర్శులు మాచర్ల కుమారస్వామి, దొంగల కొమురయ్య, మండల ప్రధాన కార్యదర్శులు గుండెల్లి సదానందం, యాదవ్, బోదల సంపత్, శ్రీరాముల శ్రీనివాస్, అంబీర్ కవిత, ఐత సాయితేజ, పెద్ది శివ, దొంగల వేణు, బండారి కరుణాకర్, బెల్లంపెల్లి శ్యాం తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మేడారం హుండీల లెక్కింపు

లెక్కింపు కేంద్రానికి పూర్తయిన తరలింపు

300 మందికిపైగా సిబ్బంది నియామకం

చుట్టు సీసీ కెమెరాలు - భారీ పోలీసు బందోబస్తు



హనుమకొండ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మేడారం జాతరలో అమ్మవార్ల గద్దెల వద్ద ఏర్పాటు చేసిన హుండీలను హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని టీటీడీ కల్యాణ మండపానికి తరలించడం మంగళవారానికి పూర్తయింది. ఆర్టీసీ కార్గో బస్సుల్లో వీటిని భారీ బందో బస్తు మధ్య తీసుకువచ్చారు. మొత్తం 512 హుండీల ను కల్యాణ మండపానికి చేర్చారు. వీటిని పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్ల మధ్య భద్రపరిచారు. మేడారంలో జాతర ఇంకా సాగుతోంది. తల్లులు శనివారమే వనప్రవేశం చేసినప్పటి కీ తల్లుల దర్శనానికి భక్తులు ఇంకా పెద్ద సంఖ్యలో వస్తూనే ఉన్నారు. ఎత్తుబెల్లం, పసుపు కుంకుమ, చీరె సారెలతో పాటు నగదు రూపంలో కానుకలను సమర్పిస్తున్నారు. దీంతో నిండిన హుండీలను తరలించడం తో పాటు మరో కొన్ని ఖాళీ హుండీలను అక్కడు అందుబాటులో ఉం చారు. భక్తులు నగదుతో పాటు వెండి, బంగారు కానుకలను ఈ హుం డీలో వేస్తున్నారు. ఈ దృష్ట్యా లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యేలోగా ఈ హుండీల సంఖ్య పెరగవచ్చునని అధికారులు చెబుతున్నారు.

హుండీల లెక్కింపుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. మండపాన్ని శుభ్రం చేశారు. చుట్టు భద్రతావలయాన్ని ఏర్పాటు చేశారు. లెక్కింపు కేంద్రం లోపల, బయట 60కిపైగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. లెక్కింపునకు దేవాదాయ శాఖ, రెవెన్యూ పోలీసు శాఖ పక్షాన 300 మందిని నియమిస్తున్నారు. వీరే కాకుండా లెక్కింపులో పాల్గొనేందుకు స్వచ్ఛం సంస్థల నుంచి మరో 100 నుంచి 150 మందిని ఆహ్వానిస్తున్నారు. లెక్కింపులో పాల్గొనేవారికి ప్రత్యేకంగా డ్రెస్‌కోడ్ ఉంటుంది. ఈనెల 29వ తేదీన కలెక్టర్ సిక్తా పట్నాయక్ హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. లెక్కింపు పది రోజుల వరకు కొనసాగవచ్చు.

హుండీలను తెరిచేప్పుడు ప్రతీ అంశాన్ని రికార్డు చేస్తారు. ప్రత్యేక రిజిస్టర్‌ను నిర్వహిస్తారు. హుండీని తెరిచే ముందు వాటి సీళ్లను నిషితంగా పరిశీలిస్తారు. ఆ తర్వాత దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, పూజారుల సమక్షంలో ఒక్కొక్కటిగా తెరిచి కుమ్మరిస్తారు. బియ్యం, నగదు, వెండి, బంగారు వస్తువులను వేరు చేస్తారు. నగదును లెక్కిస్తారు. వెండి, బంగారు కానుకలను చివరన తూకం వేస్తారు. నగదుతో పాటు హుండీలో కానుకలుగా విదేశీ డాలర్లు కూడా పడతాయి. ఎన్ఆర్ఐ భక్తులు తల్లులకు కానుకలుగా ఆయా దేశాల డాలర్లను కానుకల రూపంలో వేస్తారు. వీటిని కూడా చివరన లెక్కిస్తారు.

హుండీలో భక్తులు నగదుతో బెల్లాన్ని కూడా వేస్తారు. దీనితో చాలా నోట్లు బెల్లంతో తడిసి ముద్దవుతాయి. అటువంటి నోట్లను సబ్బునురగలో నానబెట్టి శుభ్రం చేసి ఆరబెడతారు. ఆరిని తర్వాత లెక్కిస్తారు. హుండీలో నుంచి బయటపడిన చిల్లర నాణాలను సైతం ఒక దగ్గర కుప్పపోస్తారు. వీటన్నిటిని తూకం వేయడం ద్వారా వాటిని కూడా చివరన లెక్కిస్తారు. హుండీల నుంచి వెళ్లిన బియ్యాన్ని సైతం ఒక దగ్గర నిలువ చేసి తర్వాత వాటిని బస్తాలకు ఎక్కించి తూకం వేస్తారు. లెక్కించిన నగదును బ్యాంకులో ఏ రోజుకారోజు జమ చేస్తారు.

పెరగనున్న ఆదాయం

ప్రతీ జాతరలాగానే ఈ సారి కూడా మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర ఆదాయం పెరవచ్చునని దేవాదాయ శాఖ అధికారులు భావిస్తున్నారు. ప్రతీ జాతరకు ఆదాయం క్రమంగా పెరుగుతూ వస్తోంది. ఈ సారి భక్తులు కూడా ఎక్కువ సంఖ్యలో వచ్చారు. ఆ మేరకు ఈ సారి ఆదాయం గతంలో కన్నా రూ. రెండు కోట్ల అంతకన్నా ఎక్కువే పెరగవచ్చునని అంచనా వేస్తున్నారు.



జోతిష్యంలో పట్టా అందుకోనున్న సుదర్శనాచార్యులు

వరంగల్, ఫిబ్రవరి 27: సంగెం మండలం చింతలపల్లిలో భవానీ శంకర అలయం, ఊకల్‌లోని శ్రీ నాగసుబ్రమణ్య స్వామి ఆలయ ప్రధాన పూజారి సముద్రాల సుదర్శనాచార్యులు హైదరాబాద్‌లో ఎంఏలో జ్యోతిష్యం పట్టాను అందుకోనున్నారు. సంగెం మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన ఆయన హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఎంఏలో జ్యోతిష్యం పూర్తి చేశారు. బుధవారం యూనివర్సిటీ ఆధ్వర్యంలో రవీంద్రభారతీలో జరిగే 16వ స్నాతకోత్సవంలో పట్టాను అందుకోనున్నారు. ఈమేరకు యూనివర్సిటీ అధికారులు ఆహ్వానం పంపారు.



సదస్సులో మాట్లాడుతున్న డీఈవో వాసంతి

పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలి: డీఈవో

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 27: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను సమన్వయంతో నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి అన్నారు. మార్చి 18వ తేదీ నుంచి నిర్వహించబోయే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలపై మంగళవారం ఖమ్మం బైపాస్ రోడ్ లోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ హైస్కూల్‌లో సన్నద్ధత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఏసీజీఈ, డీసీఈబీ సెక్రటరీలు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు పాల్గొన్నారు.

రోడ్ సేఫ్టీపై అవగాహన కల్పించాలి

5వ పేజీ తరువాయి

అధికారులకు కలెక్టర్ సూచించారు. విద్యార్థులు ఎంతమంది డ్రైవింగ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేశారు వారికి అవగాహన సదస్సు నిర్వహించారా.. రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టారని అడిగారు. గతంలో గుర్తించిన 19 బ్లాక్స్ స్పాట్లలో 11 పనులు నేషనల్ హైవే అథారిటీ వారు పూర్తి చేశారని మిగిలిన పనులు కూడా త్వరలో పూర్తి చేస్తామని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. సమావేశంలో డీసీపీ రవీందర్, ఆర్‌టీవో అధికారి లక్ష్మి, జిల్లాకు చెందిన పలు శాఖల అధికారులతోపాటు పోలీసు శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, ట్రాన్స్‌ఫోర్ట్ శాఖ, నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్, మున్సిపల్ కమిషనర్, వరంగల్ సీఎస్‌వో, ఆర్ అండ్ బీ అధికారులు, ఎన్జీవో వరంగల్, ఆర్టీసీ అధికారులు తొమ్మిది మందితో కండక్ట్ కమిటీని ఏర్పాటు చేశారు.

మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా గణేష్

వరంగల్, ఫిబ్రవరి 27: ఖిలావరంగల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా జన్ను గణేష్ నియమితులయ్యారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తన నివాసంలో గణేష్‌కు పార్టీ కండువా కప్పి అభినందించారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఎమ్మెల్యే అన్నారు. 43వ డివిజన్ మామునూరుకు గణేష్ కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను గుర్తించి మండల పార్టీ అధ్యక్ష పదవి ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మామునూరు గ్రామ శాఖ అధ్యక్షుడు గంటా సత్యానారాయణ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ జన్ను యేసేబు, కలకొట్ల బాస్కర్, కలకొట్ల రవీందర్, భాష పాకల జాన్సన్, సింగారపు ప్రభాకర్, వంశీ, మన్నె హరీష్, ప్రసాద్ పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటర్లు 40,256



ఇటీవల ముసాయిదా జాబితా విడుదల

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 27: జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటరుగా నమోదు నమోదు చేసుకోగా ఇటీవల ఎన్నికల అధికారులు ఓటర్ల ముస్తాయిదా జాబితాను ఇటీవల విడుదల చేశారు. ఈనెల 24 వరకు ఓటరుగా జిల్లా వ్యాప్తంగా 43,483 మంది పట్టభద్రులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 40,256 ఓటర్లను ఎన్నికల అధికారులు గుర్తించి, ఓకే చేశారు. సరైన వివరాలు లేకపోవడంతో 3,225 దరఖాస్తులను అధికారులు నిరాకరించారు. మరో రెండు పెండింగ్‌లో ఉంచారు.

మండలాల వారీగా నమోదు ఇలా..

ఖానాపురం మండలంలో 1,613 మంది పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోగా 1,463 మందికి అధికారులు ఆమోదం తెలిపారు. అలాగే దుగ్గొండిలో 2,309 మందికి 2,108, సంగెంలో 2,692 మందికి 2,463, నర్సంపేటలో 4,448 మందికి 4,120, ఖిలావరంగల్ మండలంలో 8,203 మందికి 7,747 ఓటర్లగా నమోదయ్యారు. అలాగే గీసుగొండలో 2,975 మందికి 2,736, రాయపర్తిలో 2,519కి 2238, నల్లబెల్లిలో 1,809కి 1,693, వర్ధన్నపేటలో 1,858 మందికి 1,644 మంది ఓటరుగా నమోదయ్యారు. వరంగల్‌లో 9,255 మందికి 8,841, చెన్నారావుపేటలో 1,742కి 1,586, నెక్కొండలో 2,175కి 1,984, పర్వతగిరి మండలంలో 1,885 మందికి గాను 1,632 ఓటరుగా నమోదయ్యారు. జిల్లా వ్యాప్తంగా 43,483 మంది నమోదు చేసుకోగా, ఆన్‌లైన్ ద్వారా 43,326, ఆఫ్‌లైన్ ద్వారా 157 మంది దరఖాస్తులు వచ్చాయి. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న 43,326లో 40,103 ఓటర్లుగా అధికారులు గుర్తించారు. 157 ఆఫ్‌లైన్ ఓటర్లలో 153 ఓకే చేశారు. 3,221 ఆన్‌లైన్ దరఖాస్తుదారులను రిజక్ట్ చేశారు. ఆఫ్‌లైన్ ద్వారా నలుగురిని రిజక్ట్ చేశారు. మరో ఇద్దరిని పెండింగ్‌లో ఉంచారు.

మార్చి 14 వరకు అవకాశం..

ఎన్నికల సెక్షన్ అధికారి బి. విశ్వనారాయణ

పట్టభద్రుల ఓటర్లుగా జిల్లావ్యాప్తంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వాటిని పరిశీలించి సరిగా ఉన్నవాటిని ఓకే చేసి లేనివాటిని రిజక్ట్ చేశాం. ఆఖరుగా మార్చి 14 వరకు పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. పట్టభద్రులు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చు.

ఎంపీ సీటును కైవసం చేసుకోవాలి : బీజేపీ



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ప్రదీప్‌రావు

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 27: అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓటు బ్యాంకు గణనీయంగా పెరిగిందని, అదే కృషితో వరంగల్ పార్లమెంట్ సీటును కైవసం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం పుప్పాలగుట్టలోని ఓ కల్యాణ మండపంలో బీజేపీ తూర్పు నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ప్రదీప్‌రావు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో తన గెలుపు కోసం ప్రతీ కార్యకర్త తీవ్రంగా కృషి చేశారని, అయితే స్వల్ప మెజారీటీతో ఓడిపోయానని గుర్తు చేశారు. తన కోసం, పార్టీ కోసం అదే పట్టుదలతో ప్రతీ కార్యకర్త పనిచేయాలని కోరారు. తాను గెలిచినా, ఓడినా ప్రతీ క్షణం ప్రజల మధ్యనే ఉంటూ సేవ చేస్తుంటానన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ ప్రభారి డాక్టర్ మురళీధర్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కుసుమ సతీష్, రత్నం సతీష్‌సా, మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్, పిట్టల కిరణ్, సిద్ధం నరేష్, కృష్ణకిషోర్, ప్రధానకార్యదర్శి బాకం హరిశంకర్, గాడిపెల్లి రాజేశ్వర్‌రావు, అసెంబ్లీ కన్వీనర్ పొట్టి శ్రీనివాస్‌గుప్త, అధికార ప్రతినిధి తాబేటి వెంకట్‌గౌడ్, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాదాసి రాజు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కందిమల్ల మహేష్, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు భరత్ వీర్, నాయకులు సముద్రాల పరమేశ్వర్, డాక్టర్ వన్నాల వెంకటరమణ పాల్గొన్నారు.

విజయ సంకల్ప సభను జయప్రదం చేయాలి: గంట

వరంగల్ తూర్పు నియోజకవర్గంలో బీజేపీ ఆధ్వర్యంలో మార్చి 1న నిర్వహించే విజయ సంకల్ప యాత్రను జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ కోరారు. ఆత్మీయ సమ్మేళనంలో రవికుమార్ మాట్లాడుతూ... బీజేపీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేసేందుకు నియోజకవర్గంలోని ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాదాసు రాజు

'మేడారం జాతర నిర్వహణలో వైఫల్యం'

కరీమాబాద్, ఫిబ్రవరి 27: మేడారం మహా జాతర నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదాసు రాజు ఆరోపించారు. మంగళవారం ఏకశిలానగర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ జాతర అధికారులకు పిక్నిక్ స్పాట్‌గా మారిందని ఆరోపించారు. భక్తులకు తాగునీరు, రవాణా, ట్రాఫిక్, పారిశుధ్యం, దర్శనం క్యూలైన్లు, ఆరోగ్య చికిత్సలు, జాతర నుంచి తిరిగి వచ్చే సందర్భంలో ఇలా ప్రతి విషయంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. 2022లో అప్పటి ప్రభుత్వం రూ.75కోట్లు మంజూరు చేయగా ఇప్పటి ప్రభుత్వం రూ.110కోట్లు మంజూరు చేసినా సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి జాతరకు వచ్చి వెళ్లిన తర్వాత జిల్లా యంత్రాంగం చేతులెత్తేసిందన్నారు. భక్తులు సుమారు 12 గంటలపాటు ట్రాఫిక్‌లో చిక్కుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని మండిపడ్డారు. సమావేశంలో 39వ డివిజన్ అధ్యక్షుడు మాచర్ల రవీందర్, భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు చిట్ల వేణు, రాము, సందీప్, కూరపాటి రాకేష్ పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలి : సీపీఐ



సమావేశంలో ప్రసగిస్తున్న రవి

ఖిలావరంగల్, ఫిబ్రవరి 27: రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి డిమాండ్ చేశారు. మంగళవారం శివనగర్‌లోని తమ్మెర భవన్‌లో సీపీఐ వరంగల్ మండల, జిల్లా సమితి సమావేశాన్ని గుండె బద్రి అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత పదేళ్లలో కార్పొరేట్ వర్గాలకు దేశ సంపదను దోచిపెడుతూ, రైతులను, కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిందని ఆరోపించారు. రైతులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన మూడు చట్టాలను ఉపసంహరించుకోవాలని ఢిల్లీలో రైతులు చేపట్టిన పోరాట ఫలితంగా కేంద్ర ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ బాషుమియా, పంజాల రమేష్, మండల కార్యదర్శి బుస్సా రవిందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, జన్ను రవి, సంద్ర కుమార్, ల్యాదెళ్ళ శరత్, పరికిరాల రమేష్, రాయల స్వప్న, వెంకన్న, అమ్జత్ పాల్గొన్నారు.

గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

మట్టెవాడ, ఫిబ్రవరి 27: వరంగల్ మట్టెవాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాపయ్యపేట చమన్ వద్ద మంగళవారం రాత్రి గంజాయి సరఫరా చేస్తున్న షేక్ రాజును తెలంగాణ స్టేట్ నార్కోటిక్ బ్యూరో అధికారులు, మట్టెవాడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. షేక్ రాజు వద్దకిలో గంజాయిని స్వాధీన పరుచుకున్నట్లు మట్టెవాడ పోలీసులు తెలిపారు. అదే విధంగా గంజాయి సేవిస్తున్న మరో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. షేక్ రాజుపై కేసు నమోదు చేసి మంగళవారం రాత్రి రిమాండ్‌కు తరలించినట్లు మట్టెవాడ ఎస్సై విఠల్‌తెలిపారు.

'గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి'

మట్టెవాడ, ఫిబ్రవరి 27: మహాత్మాగాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చట్టపరమైన చర్య తీసుకోవాలని వరంగల్ ఆర్యవైశ్య పట్టణ సంఘం అధ్యక్షుడు, మాజీ మేయర్ గుండా ప్రకాష్‌రావు అన్నారు. మంగళవారం వరంగల్ చౌరస్తాలోని వైశ్య భవన్‌లో ఆవోపా సమావేశంలో మాట్లాడుతూ సిద్దిపేట మండలం బక్రీచప్పల గ్రామంలో మహాత్మాగాంధీ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుసుపునూరి వీరన్న, నాయకులు మల్యాల వీరమల్లయ్య, బెల్దె వెంకటేశ్వర్లు, గుంటూరు వెంకటనారాయణ, సుధాకర్, నాగరాజు పాల్గొన్నారు.

ఆరెకటిక క్యాలెండర్ ఆవిష్కరణ

వరంగల్, ఫిబ్రవరి 27 : కరీమాబాద్ ఆరె కటిక సేవా పరపతి సంఘం క్యాలెండర్‌ను మంగళవారం కుల సంఘం బాధ్యులు ఆవిష్కరించారు. ఆరెకటిక పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి, సంఘం అధ్యక్షుడు గోగికార్ రవీందర్ మాట్లాడుతూ పరపతి సంఘాల ద్వారా సభ్యులు ఆర్థికంగా ఎదగాలన్నారు. ఐక్యంగా ఉంటూ సామాజిక భద్రతను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు నామ్‌తాబాద్ కిషన్, శివాజీ, టింగిలికార్ సురేష్, గోగికార్ శ్యామ్‌బాబు, నాగరాజు, శ్రీనివాస్, టింగిలికార్ సతీష్, వాన్‌కార్ రవి, అగల్‌దీటి గణేష్, గోగికార్ కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

రంగశాయిపేటలో ఘనంగా ఉర్సు



రంగశాయిపేట దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న డీసీపీ బారీ

వరంగల్, ఫిబ్రవరి 27: రంగశాయిపేటలోని హజ్రత్ సయ్యద్ అబ్దుల్లా షహీద్ దర్గాలో ఉర్సు ఘనంగా నిర్వహించారు. సోమవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఉత్సవాల్లో దర్గా పీఠాధిపతి సయ్యద్ ఖాదర్ అలీషా ఖాద్రి చేతుల మీదుగా గంధం, చాదర్‌ను సమర్పించారు. మూడు రోజుల ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. అనంతరం మహంకాళీ మైదానంలో జరిగిన కవ్వాలీ ఆకట్టుకుంది. ఉర్సు పీఠాధిపతులు నవీద్ బాబా, ఉబేద్ బాబాలతోపాటు మత గురువులు ఆధ్యాత్మిక బోధనలు చేశారు. ఉత్సవాల్లో వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ బారీ, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కార్పొరేటర్లు గుండు చందనపూర్ణచందర్, పోశాల పద్మస్వామి, మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య, ఎస్ఐ వెంకన్నలు, సయ్యద్ బషీర్ పాల్గొన్నారు.

రోషన్ షహీద్ దర్గాలో..

ఖమ్మం రోడ్ మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్ వద్ద గల హజ్రత్ సయ్యద్ రోషన్ షహీద్ దర్గాలో మంగళవారం రాత్రి ఉర్సు ఉత్సవాలు నిర్వహించారు. దర్గా కమిటీ అధ్యక్షుడు సయ్యద్ షా ఆరిఫుద్దీన్ హుస్సేనీ ఆధ్వర్యంలో చాదర్‌ను సమర్పించారు. ఉర్సు దర్గా పీఠాధిపతులు నవీద్ బాబా, ఉబేద్ బాబాలు ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వేడుకల్లో కమిటీ బాధ్యులు సయ్యద్ షా ముజాహిద్ ఖాద్రీట, ఎమ్డీ ఇబ్రహీం, ఖాదీర్, జావెద్, ఎస్డీ రబ్బానీ, నవాజ్, ఎమ్డీ రహమత్ బాబా, రషీద్, సందానీ, నజీర్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో గుమస్తాపై కత్తితో దాడి



ఎంజీఎంలో చికిత్స పొందుతున్న సురేశ్

మట్టెవాడ, ఫిబ్రవరి 27: రామన్నపేటలో మద్యం మత్తులో హర్ప హరి అనే వ్యక్తి బట్టల షాపు గుమాస్తాపై కత్తితో దాడి చేసిన ఘటన మంగళ వారం రాత్రి చోటుచేసుకుంది. మట్టెవాడ పోలీసులు, బాధితుడు సురేశ్ కథనం ప్రకారం. రామన్నపేటకు చెందిన హర్ప హరి మద్యం మత్తులో మంగళవారం రాత్రి రామన్న పేటలోని వరలక్ష్మి బట్టల దుకాణానికి వచ్చి బట్టలు ఇవ్వాలని అడిగాడు. డబ్బులు ఇస్తేనే బట్టలు ఇస్తామని గుమాస్తా సురేశ్ చెప్పాడు. దీంతో ఆగ్రహించిన హరి షాపులో ఉన్న చిన్న కత్తితో సురేశ్‌పై దాడిచేశాడు. వెంటనే సురేశ్‌ను ఎంజీఎంకు తరలించారు. ఎంజీఎంలో సురేశ్ నుంచి ఎస్సై నవీన్ వివరాలను సేకరించారు.

సోలార్ రూఫ్ ప్లాంట్లకు దరఖాస్తు చేసుకోవాలి

గిర్మాజిపేట, ఫిబ్రవరి 27 సబ్సిడీతో సోలార్ రూఫ్ ప్లాంట్‌లను గృహాలపై ఏర్పాటు చేసుకుని నెలకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్ పొందే కేంద్ర ప్రభుత్వ సూర్యఘర్ ముఫ్తీ యోజన పథకానికి పోస్టాఫీస్‌లో దరఖాస్తు చేసుకోవాలని వరంగల్ పోస్టల్ విజన్ సూపరింటెండెంట్ ఎస్‌ఎల్‌వీఎస్ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ గృహాలపై ప్రభుత్వ సబ్సిడీతో సోలార్ రూఫ్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసుకోవాలనుకునే వారు తమ ప్రాంత పోస్ట్ ఆఫీస్, పోస్ట్‌మెన్‌కు వివరాలు అందజేయాలని పేర్కొన్నారు. వినియోగ దారులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే సంబంధిత అధికారులు ఇంటికి వచ్చి ఏర్పాటు చేస్తారని వెల్లడించారు.

మిర్చి యార్డులో జీరో దందా

ఇద్దరు వ్యాపారులకు నోటీసులు జారీ

వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 27: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ మిర్చి యార్డులో జీరో దందా కొనసాగుతోంది. మంగళవారం హిరమణి ట్రేడర్స్ నిర్వాహకులు 15బస్తాలు, కాకతీయ ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకులు 10 మిర్చి బస్తాలను మార్కెట్ నుంచి వాహనాలలో బయటకు తరలిస్తుండగా యార్డు సూపర్‌వైజర్లు పట్టుకున్నారు. మార్కెట్‌కు ఎలాంటి పన్ను కట్టకుండా బయటకు తరలిస్తుండడంతో గేటు వద్ద పట్టుకుని మార్కెట్ కార్యదర్శి సంగయ్యకు సమాచారం అందించారు. పట్టుకున్న బస్తాలను సీజ్ చేయించడంతోపాటు నిర్వాహకులకు, అలాగే వారికి సహకరించిన ఒక దడువాయికి నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కార్యదర్శి సంగయ్య మాట్లాడుతూ.. మార్కెట్లో జీరో దందాను ఎట్టి పరిస్థితిలోనూ ఉపేక్షించేదిలేదని, జీరో దందాకు పాల్పడితే వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బస్సు యాత్రను సక్సెస్ చేయాలి

వరంగల్, ఫిబ్రవరి 27 : బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో చేపట్టిన విజయ సంకల్ప బస్సు యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి మొలుగూరి శ్రీనివాస్ కోరారు. మంగళవారం సంగెం మండలకేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 29న పరకాల నియోజకవర్గంలో బస్సుయాత్ర సందర్భంగా కిషన్‌రెడ్డి హాజరవుతారన్నారు. మండలం నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొని సక్సెస్ చేయాలని కోరారు.

'వెంకటేశ్వర్లు సేవలు మరువలేనివి'



వెంకటేశ్వర్లు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘం

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 27: పద్మశాలి సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు దిగవంత అంకం వెంకటేశ్వర్లు పద్మశాలి కులస్తులకు, సమాజానికి చేసిన సేవలు మరువలేనివని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు అడెపు రవీందర్ అన్నారు. పోచమ్మమైదాన్ చౌరస్తాలో మంగళవారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఇటీవల మృతి చెందిన అంకం వెంకటేశ్వర్లు సంతాప సభ నిర్వహించారు. మృతుడి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వద్నాల నరేందర్, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం, జిల్లా గౌరవ అధ్యక్షుడు కుసుమ సతీష్, సిటీ అధ్యక్షుడు డీఎస్ మూర్తి, ప్రొఫెసర్ వంగరి సూర్యనారాయణ, గుండు కామేశ్వర్, మాటేటి అశోక్, సామల శ్రీధర్, వైద్యం రాజగోపాల్, మార్గం ఎల్లయ్య పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న మల్లారెడ్డి కుటుంబం

వరంగల్, ఫిబ్రవరి 27: పుప్పాలగుట్ట బ్యాంక్‌కాలనీకి చెందిన ఎడ్ల మల్లారెడ్డి కుటుంబసభ్యులు రంగశాయిపేటలోని ఎలగందుల అమృత స్మారక వృద్ధాశ్రమంలో మంగళవారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. మల్లారెడ్డి- మంజుల దంపతుల కూతురు మన్విత-రాహుల్‌లకు ఇటీవల వివాహం జరిగిన ఈ సందర్భంగా వృద్ధుల ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో న్యాలకొండ శ్రీధర్‌రావు దంపతులు, బిక్షం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో ప్రతిభ



ట్రోఫీలతో నాగేంద్రబాబు

వరంగల్, ఫిబ్రవరి 27 : జాతీయ స్థాయి ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలో టీఎస్ఎస్‌పీ పోలీసు కానిస్టేబుల్ ప్రతిభ కనపర్చారు. మామునూరు టీఎస్ఎస్‌పీ ఫోర్త్ బెటాలియన్ పోలీసు కానిస్టేబుల్ నాగేంద్ర బాబు ప్రతిభ కనపర్చి రెండు ట్రోఫీలు సాధించారు. ఈ సందర్భంగా బెటాలియన్ కార్యాలయంలో మంగళవారం బెటాలియన్ కమాండెంట్ శివప్రసాదరెడ్డి అడిషనల్ కమాండెంట్ ప్రకాష్‌రావులు బాబును అభినందించారు. ఈనెల 12 నుంచి 16 వరకు ఉత్తర ప్రదేశ్‌లోని లక్నోలో జరిగిన 67వ ఆలిండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో ప్రతిభ కనపర్చారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్సై



వరంగల్, ఫిబ్రవరి 27: సంగెం ఎస్సైగా ఎల్.నరేష్ మంగళవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. వీఆర్‌లో ఉన్న నరేష్‌ను నగర పోలీస్ కమిషనర్ సోమవారం ఇచ్చిన బదిలీ ఉత్తర్వు మేరకు బాధ్యతలు చేప టారు. 2014 బ్యాచ్‌కు చెందిన నరేష్ ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వారు.. ఇంత కాలం ఇక్కడ పనిచేసిన భరత్ జనగామకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో నరేష్ సంగెంకు వచ్చారు.

బియ్యాల జనార్దన్‌కు నివాళి

వరంగల్, ఫిబ్రవరి 27 : నగరంలోని 43వ డివిజన్ ఆర్టీఏ జంక్షన్‌లో ఆదివాసుల ఆశాజ్యోతి డాక్టర్ బియ్యాల జనార్దన్‌రావు వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయనకు నివాళులర్పించారు. ఖమ్మం జాతీయ రహదారిలోని జంక్షన్‌లో జనార్దన్‌రావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈదురు అరుణ భర్త విక్టర్, సత్యసాయినగర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు తరిగల శ్రీధర్ రావు, నాయకులు శ్రీనివాస గుప్త, క్రాంతి, చొక్కారావు, సదానందం తదితరులు పాల్గొన్నారు.



జనార్దన్ రావుకు నివాళులర్పిస్తున్న అభిమానులు

విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న దుబ్బతండా వాసులు

వర్ధన్నపేట, ఫిబ్రవరి 27 : వర్ధన్నపేట మునిసిపాలిటీ పరిధిలోని దుబ్బ తండాలో గత కొన్ని రోజులుగా విద్యుత్ సమస్య ఎదురవుతోంది. అయినా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదంటూ దుబ్బతండా వాసులు మంగళవారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని విద్యుత్ కార్యాలయా నికి చేరుకొని అధికారులను నిలదీశారు. తమ తండాలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొం టున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదంటూ ప్రశ్నించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరించే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. అధికారు లు దుబ్బ తండా వాసులకు నచ్చజెప్పి విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామనడంతో తండావాసులు శాంతించారు.

ఉచిత విద్యుత్ పథకం రిజిస్ట్రేషన్లు ప్రారంభం


కేంద్రం ప్రభుత్వ ఉచిత విద్యుత్ పథక పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పోస్టల్ ఉద్యోగులు

వరంగల్, ఫిబ్రవరి 27 : పోస్టాఫీసు ద్వారా మోదీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 300 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం రిజి స్ట్రేషన్లను ప్రారం భించామని నర్సంపేట పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రమేశ్ అన్నారు. పట్టణంలో మంగళవారం కేంద్రం ప్రవేశపెట్టిన ఉచిత విద్యుత్ (పీఎం సూర్య ఘర్‌ముఫ్త్ బిజ్లీ యోజన) పథకం పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పెరిగి పోతున్న కాలుష్యాన్ని తగ్గించడం కోసం సహజవనరులను కాపాడుకోవడానికి నరేంద్రమోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని ప్రోత్సహించడంపై దృష్టిసారించినట్లు తెలిపారు. ఇప్పటికే సోలార్‌రూఫ్‌టాప్ పథకాన్ని దేశవ్యాప్తం అమలు చేస్తుందన్నారు. ఇందులో భాగంగా వినియోగ దారుల ఇళ్ళపై సోలార్ ప్లేట్లను అమర్చనున్నారని పేర్కొన్నారు. దీని ద్వారా వారు సౌర విద్యుత్‌ను వినియోగించుకోవడంతో పాటు కరెంటు బిల్లుల భారం తగ్గించడం కోసం కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీయోజన పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ స్కీమ్‌లో దేశవ్యాప్తంగా ఇళ్ళకు సబ్సిడీపై సోలార్‌రూఫ్‌ప్లాంటును నిర్మించి ఇచ్చి నెలకు 300 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ అందించే ఈ పథకానికి పోస్టాఫీసు ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్ ప్రారంభించారన్నారు. ఆసక్తికలిగిన వినియోగదారులు పోస్టల్ సిబ్బందికి తమ వివరాలను అందిస్తే వారు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారన్నారు. నమోదైన తర్వాత సంబంధిత అధికారులు సోలార్ ప్లాంట్‌లను ఇన్‌స్టాల్ చేస్తారని ఆయన పేర్కొన్నారు. ప్రజలు అత్యధిక సంఖ్యలో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పోస్టుమాస్టర్ దార్ల రాజేందర్, పోస్టల్ అసిస్టెంట్ జాటోతు రాజన్,వీరభద్రయ్య, అశోక్ మెయిల్ ఓవర్సీస్, సురేశ్, సంపత్, శ్రీకాంత్, అనూష, కిషోర్, నాగేందర్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 27 : డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి మూడు రోజుల సాధారణ జైలు శిక్షతో పాటుగా రూ.500 జరిమానా విధిస్తూ నర్సంపేట సెకండ్ క్లాస్ స్పెషల్ మెజిస్ట్రేట్ ఎ.వెంకటేశం మంగళవారం తీర్పునిచ్చినట్లు టౌన్ సీఐ డి.రమణమూర్తి తెలిపారు. సీఐ తెలిపిన వివరాలిలావున్నాయి. ఈ నెల 10, 19 తేదీల్లో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఇల్లందుల నర్సయ్య, ఆలూరి వెంకటేశ్వర్లు మద్యం సేవించి వాహనాలను నడుపుతుండడాన్ని గమనించి చెక్ చేయగా, అధిక మోతాదులో మద్యం సేవించినట్లు నమోదైందన్నారు. దీంతో సీడీవో పీసీ ఓ.రాజు మెజిస్ట్రేట్ ముందు మంగళవారం హాజరుపర్చగా ఆయన నర్సయ్య, వెంకటేశ్వర్లుకు మూడు రోజుల సాధారణ జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 500 జరిమానా విధించినట్లు సీఐ వివరించారు.

ఇక రైతు వేదికల్లో దృశ్యశ్రవణ సేవలు

- రైతులకు అందనున్న సలహాలు, సూచనలు
- అన్నదాతలకు చేకూరనున్న ప్రయోజనం

వర్ధన్నపేట, ఫిబ్రవరి 27 : గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన రైతు వేదికలకు నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం జోడిస్తోంది. పంటల సాగుకు దృశ్య, శ్రవణ విధానంలో రైతులకు వ్యవసాయ ఉన్నత అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు అందించేందుకు సన్నాహాలు చేస్తోంది. ముందుగా నియోజకవర్గానికో రైతు వేదికను ఎంపిక చేసి ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా వరంగల్ జిల్లాలో వర్ధన్నపేట నియోజకవర్గం, నర్సంపేట నియోజకవర్గంలో ముందుగా ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా సోమవారం వర్ధన్నపేటలోని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ట్రయల్ రన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ట్రయల్ రన్ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారులు పాల్గొని వీక్షించారు.

- నిధులు మంజూరు

దృశ్య శ్రవణ విధానంలో సలహాలు, సూచనలు ఇచ్చే కేంద్రంగా రైతు వేదికలను మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించడంతోపాటు వ్యవసాయశాఖ అధికారుల నుంచి ప్రతిపాదనలు స్వీకరించింది. రైతులకు అందుబాటులో ఉండేలా అనువైన వేదికలను ఎంపిక చేసి ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించడం జరుగుతుంది. ఇలా ఎంపిక చేసిన రైతు వేదికలకు రూ.3.70 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ టెలివిజన్ దృశ్య శ్రవణ కార్యక్రమానికి అవసరమైన పరికరాలను సమకూర్చుతున్నారు. ఇప్పటికే ఎంపిక చేసిన రైతు వేదికల్లో ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించడంతోపాటు ట్రయల్ రన్‌ను కూడా నిర్వహించారు.

- సలహాలు, సూచనలతో పాటు పథకాల సమాచారం..

ఎంపిక చేసిన రైతు వేదికల్లో రైతులకు వ్యవసాయ, ఉద్యాన, పట్టు, మల్బరీ,


వీడియో కాన్ఫరెన్స్‌లో వీక్షిస్తున్న ట్రయల్ రన్ (ఫైల్)

మత్స్య, పశు సంవవర్ధక, విద్యుత్, నీటి పారుదల శాఖలకు సంబంధించిన అన్ని ప్రభుత్వ పథకాలు, సమాచారం అందించనున్నారు. వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

- రైతులకు ప్రయోజనం

సురేశ్, ఏడీఏ, వర్ధన్నపేట

రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన దృశ్య, శ్రవణ కేంద్రాల ద్వారా రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. వర్ధన్నపేటలోని రైతు వేదికలో దృశ్య, శ్రవణ ట్రయల్ రన్ నిర్వహించారు. ఏఈవోల ఆధ్వర్యంలో శిక్షణ తరతగతులు నిర్వహిస్తారు. రైతు వేదికల్లో నిపుణుల ఇచ్చే సలహాలు, సూచనలు పాటించి రైతులు అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంది.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 27 : నర్సంపేట పట్టణంలోని జడ్‌పీహెచ్ఎస్(బాలుర) హై స్కూల్‌లో మంగళవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్రపోషించి తోటి విద్యార్థులకు విద్యాబోధనచేశారు. హెచ్ఎంగా కె.తేజశ్రీ, డీఈవోగా ఎస్.ఆర్తికేయలు వ్యవహరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఉత్తమ విద్యాబోధన చేసిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కొర్ర సారయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే పాఠాలను బోధించారు. డీఈవోగా డీఓఈవో నిఖిత, హెచ్ఎంగా దీలీప్, పీఈటీలుగా శ్రీకర్, కిట్టు తెలుగు పండిట్‌గా పద్మావతి, ఫిజికల్‌సైన్స్ అశ్విని, సరిత, అంజలి లతో పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- నెక్కొండ : పాఠశాలలో నిర్వహించే స్వయం పరిపాలనతో తరగతి గదుల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధించే సమయంలో పడే కష్టాలు తెలుస్తాయని సెయింట్ థెరిసా హై స్కూల్ కరస్పాండెంట్ చల్లా యాకుబ్‌రెడ్డి అన్నారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా బోధన సమయంలో విద్యార్థులు అల్లరి చేయకుండా శ్రద్ధగా పాఠాలు విన్న విద్యార్థులే విద్యలో రాణిస్తారన్నారు. డీఈవోగా మాలోతు ప్రదీప్‌కుమార్, ఎంఈవోగా చెరుకు జీవన్‌కుమార్, ప్రధానోపాధ్యాయురాలిగా బాదవత్ చందన, కరస్పాండెంట్‌గా ఆకుతోట నిఖిత వ్యవహరించారు. ఉత్తమంగా బోధించిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మమత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నెక్కొండ పోస్టుమాస్టర్‌గా రత్నమాల


రత్నమాల

నెక్కొండ, ఫిబ్రవరి 27 : నెక్కొండ బ్రాంచ్ పోస్టు మాస్టర్‌గా అసం రత్నమాల మంగళవారం బాధ్యతలను చేపట్టారు. రత్నమాల వరంగల్ నుంచి బదీలిపై నెక్కొండకు వచ్చారు. నెక్కొండలో ఇంతకాలం విధులను నిర్వహించిన తౌశిక్‌అహ్మద్ వరంగల్ హెడ్ పోస్టాఫీస్‌కు బదిలీ అయ్యారు. పోస్టల్ సేవలను, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పలు పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

బహిరంగ సభకు తరలిన మహిళా సంఘాల సభ్యులు


బహిరంగ సభకు వెళుతున్న మహిళా సంఘాల లీడర్లు

వర్ధన్నపేట, ఫిబ్రవరి 27 : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేవెళ్లలో నిర్వహించే భారీ బహిరంగ సభలో పాల్గొనేందుకు మహిళా సంఘాల సభ్యులు మంగళవారం తరలివెళ్లారు. వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో మహిళా సంఘాల లీడర్లు, ఆశ వర్కర్లు అధిక సంఖ్యలో బయలుదేరి వెళ్లారు. ప్రత్యేకంగా వాహనం ఏర్పాటు చేసుకొని బహిరంగ సభకు వర్ధన్నపేట నుంచి తరలిపోయారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాలు శ్రీలక్ష్మీ పట్టణ సమైక్య అధ్యక్షురాలు లక్ష్మీ, ఆర్పీలు మహేశ్వరి, ప్రేమలత, జయ, విజయ, బోజ్యా, వసుంధర, మోతీలాల్, సోమరాజు తదితరులు ఉన్నారు.

మెడికల్ షాపులను తనిఖీ చేసిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్


మందులను పరిశీలిస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అరవింద్‌రెడ్డి

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 27 : నర్సంపేట పట్టణంలోని పలు మెడికల్ షాపులను డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అరవింద్‌రెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు.

తనిఖీ సమయంలో నిబంధనలు పాటించని మెడికల్ షాపులకు నోటీసులు జారీచేసి సమర్థవంతమైన వివరణ ఇవ్వాలని, లేని ఎడల చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు.

3 నుంచి జాతీయ మహాసభలు


జాతీయ సభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బాధ్యులు

దుగ్గొండి, ఫిబ్రవరి 27 : సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ యూనిట్ జాతీయ మహా సభలు మార్చి 3, 4, 5 తేదీలలో ఖమ్మం జిల్లా లో జరుగుతాయని, వాటిని విజయవంతం చేయాలని ఆ పార్టీ డివిజన్ సహాయ కార్యదర్శి అడ్డూరి రాజు పిలుపునిచ్చారు. మండల కేంద్రంతో పాటు గిర్నిబావిలో మంగళవారం జాతీయ మహాసభల పోస్ట ర్లను ఆవిష్కరించి మాట్లాడారు. సీపీఐ (ఎంఎల్)ప్రజాపంథా, పీసీసీ సీపీఐ (ఎం ఎల్), సీపీఐ(ఎంఎల్)ఆర్ఐలచే నూతన ఒరవడికతో సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ కొత్త పార్టీ ఆవిర్భవిం చిందన్నారు. ఈ సందర్భంగా ఖమ్మంలో జాతీయ మహాసభలను జరుపుకోనున్నట్లు తెలిపారు.

విజయ సంకల్ప సభ ఏర్పాట్ల పరిశీలన


సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 27 : నర్సంపేట పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఈ నెల 28న బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న విజయ సంకల్ప సభ ఏర్పాట్లను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవి కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభకు ప్రజలు, కార్య కర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుసుమ సతీష్, రత్నం, కంభంపాటి పుల్లారావు, వడ్డెపల్లి నర్సింహరాములు, గోగుల రాణాప్రతాప్‌రెడ్డి, గూడూరు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

భగత్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ నూతన కమిటీ


వెంకటేశ్వరరావు

ఖానాపురం, ఫిబ్రవరి 27 : మండలంలోని ధర్మరావుపేటలో భగత్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా కత్తాల వెంకటేశ్వరరావు, వైస్ ఛైర్మన్‌గా కొలుగూరి దేవేందర్‌రావు, డైరెక్టర్లుగా కోడిమాల యాకస్వామి, తక్కళ్లపల్లి కరుణాకర్‌రావు, పోతరాజు కర్ణాకర్, జంగిలి వెంకటేశ్వర్లు, కొనుకటి రమేష్, గండ్ర రాజు, నాగెల్లి సుజాత, అటికె జ్యోతిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో భగత్‌యూత్ అధ్యక్షుడు కోరె సుధాకర్, కర్రె రమేష్, అటికె దేవేందర్, నాగెల్లి తిరుమలేష్, ఎల్లయ్య, రమేష్, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి


విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సరోజ

చెన్నారావుపేట, ఫిబ్రవరి 27: విద్యార్థులు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సరోజ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సంద ర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పాఠశాల లో 72 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 34 మంది విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులకు. వైద్య సిబ్బందికి, బూత్ లెవల్ అధికారులకు వాక్సినేటర్లకు పల్స్‌పోలియోపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ రామెల్, లింగామూర్తి, సురేందర్, పుష్పలత, ఆశా కార్యకర్తలు వసుమతి, మాధవి, అనిత, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

నల్ల చట్టాలను రద్దు చేయాలి


రాస్తారోకో నిర్వహిస్తున్న ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు

నెక్కొండ , ఫిబ్రవరి 27 : దేశానికి వెన్నముఖ అయిన రైతుల, కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తుందని వరంగల్ జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు ఆరోపించారు. ఏఐటీయూసీ, సీపీఐల ఆధ్వర్యంలో మంగళవారం నెక్కొండలోని అంబేద్కర్ సెంటర్‌లో రాస్తారోకో, ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు వ్యతిరేకంగా నూతనంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు నల్ల చట్టాలను రద్దుచేయాలని డిమాండ్‌చేశారు. రైతుల పంటలకు మద్దతు ధరలను ప్రకటించే వరకూ ఉద్యమాలను కొనసాగిస్తామంటూ హెచ్చరించారు. ఢిల్లీలో రైతులపై దాడులకు పాల్పడటం హేయమైనచర్యని అన్నారు. అనంతరం తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు షైదం యాదయ్య, సింగం వెంకటలక్ష్మీ, వీరయ్య. సరిత, లచ్చమ్మ, జ్యోతి, కనకమ్మ, బిక్షపతి , రవళి, నర్సయ్య. పద్మ పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధికి రోటరీ క్లబ్ కృషి


మాట్లాడుతున్న రోటరీ క్లబ్ అధ్యక్షుడు రమేశ్‌బాబు

దుగ్గొండి, ఫిబ్రవరి 27 : గ్రామీణ ప్రాంత విద్యార్థుల అభివృద్ధికి వరంగల్ రోటరీ క్లబ్ కృషిచేయడం జరుగుతుందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు మామిడాల రమేశ్‌బాబు అన్నారు. మండలంలోని తొగర్రాయి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రూ.25 వేల విలువ చేసే బ్యాగులు, షూస్, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రమేశ్‌బాబు మాట్లాడుతూ రోటరీ క్లబ్ ద్వారా దాతల నుంచి పిల్లల చదువుకు సంబంధించి సామగ్రిని విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. దాతల సహాయం సద్వినియోగం పరుచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో దాతలు ఆనంతుల సౌమ్య, అన్వేష్ రోటరీ క్లబ్ పూర్వ అధ్యక్షుడు బ్రహ్మదేవర ఆనందరావు, వైస్ ప్రెసిడెంట్ ఆనంతుల కుమారస్వామి, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు పరుపాటి సుధాకర్‌రెడ్డి, టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు ఈదుల వీరస్వామి, హెచ్ఎంలు మల్లయ్య, నాగేశ్వరచారి, ఉపాధ్యాయులు రఘు, రాంమూర్తి, పద్మశ్రీ పాల్గొన్నారు.

ప్రజాపాలనలో గ్యారెంటీల అమలు

వరంగల్, ఫిబ్రవరి 27 : ప్రజాపాలనలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారెంటీలన్నీ అమలుచేస్తుందని కాంగ్రెస్ పార్టీ పర్వతగిరి మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అనీల్‌రావు, నాయకులు గంగాధర్‌రావు, రాములు, రవీందర్, పూర్ణచందర్, మాధవరావు, వీరస్వామి, సాంబయ్య, కొండయ్య పాల్గొన్నారు.

ఆర్డీఎఫ్‌లో ఉచిత కంప్యూటర్ శిక్షణ

వరంగల్, ఫిబ్రవరి 27: పర్వతగిరి మండలంలోని కల్లెడ గ్రామంలో గల ఆర్డీఎఫ్ వనితా అచ్యుతాపాయ్ జూనియర్ కళాశాలలో మహిళలకు ఉచిత కంప్యూటర్, ట్యాలీ శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జనార్థన్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మార్చి 1వ తేదీ నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9490379775, 9494921759 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

రాయపర్తి, ఫిబ్రవరి 27 : ఆరు గ్యారెంటీల్లోని మరో రెండు గృహజ్యోతి పథకాలైన రూ. 500 వంటగ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలను మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించడాన్ని హర్షిస్తూ మండల కేంద్రంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యా నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.

దళిత బంధు అందించాలి

రాయపర్తి, ఫిబ్రవరి 27 : రాష్ట్రంలో దళిత బందు పథకాన్ని కొనసాగించి పేదలైన దళితులను ఆదుకోవాలని దళిత సంక్షేమ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గబ్బెట బాబు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు బంధు, కల్యాణలక్ష్మి లాంటి పథకాలు, ఇప్పటి ప్రభుత్వం అమలు పరచాలన్నారు.

ఘనంగా స్వచ్ఛంద సంస్థల దినోత్సవం

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 27 : నర్సంపేట పట్టణంలో మంగళవారం స్వచ్ఛంద సేవా సంస్థల సమాఖ్య ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక హనుమాన్‌దేవల్ స్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో పాఠశాల హెచ్ఎం కోరె రాజమౌళి మాట్లాడారు. సమాజంలో స్వచ్ఛంద సంస్థలు చేసేసేవలు అద్వితీయమైనవని అన్నారు. మదర్ థెరిస్సా, గాంధీ, గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం, రాజారాం లాంటి ఎంతో మంది ప్రజలందరికీ స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల సమాఖ్య కన్వీనర్ గిరగాని సుదర్శన్‌గౌడ్, కోట డేవిడ్ పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటర్లు 40,256 మంది

- ఇటీవల ముసాయిదా జాబితా విడుదల

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 27: జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటరుగా నమోదు నమోదు చేసుకోగా ఇటీవల ఎన్నికల అధికారులు ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేశారు. ఈనెల 24 వరకు ఓటరుగా జిల్లా వ్యాప్తంగా 43,483 మంది పట్టభద్రులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 40,256 ఓటర్లను ఎన్నికల అధికారులు గుర్తించి, ఓకే చేశారు. సరైన వివరాలు లేకపోవడంతో 3,225 దరఖాస్తులను అధికారులు నిరాకరించారు. మరో రెండు పెండింగ్‌లో ఉంచారు.

- మండలాల వారీగా నమోదు ఇలా..

ఖానాపురం మండలంలో 1,613 మంది పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోగా 1,463 మందికి అధికారులు ఆమోదం తెలిపారు. అలాగే దుగ్గొండిలో 2,309 మందికి 2,108, సంగెంలో 2,692 మందికి 2,463, నర్సంపేటలో 4,448మందికి 4,120, ఖిలావరంగల్ మండలంలో 8,203 మందికి 7,747 ఓటర్లగా నమోదయ్యారు. అలాగే గీసుగొండలో 2,975 మందికి 2,736, రాయపర్తిలో 2,519కి 2238, నల్లబెల్లిలో 1,809కి 1,693, వర్ధన్నపేటలో 1,858 మందికి 1,644 మంది ఓటరుగా నమోదయ్యారు.

వరంగల్‌లో 9,255మందికి 8,841, చెన్నారావుపేటలో 1,742కి 1,586, నెక్కొండలో 2,175కి 1,984, పర్వతగిరి మండలంలో 1,885మందికిగాను 1,632 ఓటరుగా నమోదయ్యారు. జిల్లా వ్యాప్తంగా 43,483 మంది నమోదు చేసుకోగా, ఆన్‌లైన్ ద్వారా 43,326, ఆఫ్‌లైన్ ద్వారా 157 మంది దరఖాస్తులు వచ్చాయి. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న 43,326లో 40,103 ఓటర్లుగా అధికారులు గుర్తించారు. 157 ఆఫ్‌లైన్ ఓటర్లలో 153కి ఓకే చేశారు. 3,221 ఆన్‌లైన్ దరఖాస్తు దారులను రిజక్ట్ చేశారు. ఆఫ్‌లైన్ ద్వారా నలుగురిని రిజక్ట్ చేశారు. మరో ఇద్దరిని పెండింగ్‌లో ఉంచారు.

- మార్చి 14 వరకు అవకాశం

విశ్వనారాయణ, ఎన్నికల సెక్షన్ అధికారి

పట్టభద్రుల ఓటర్లుగా జిల్లావ్యాప్తంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వాటిని పరిశీలించి సరిగా ఉన్నవాటిని ఓకే చేసి లేనివాటిని రిజక్ట్ చేశామన్నారు.

ఆఖరుగా మార్చి 14వరకు పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందని పట్టభద్రులు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చని అన్నారు.

రోడ్ సేఫ్టీపై అవగాహన కల్పించాలి

(5వ పేజీ తరువాయి)

అధికారులకు కలెక్టర్ సూచించారు. విద్యార్థిని విద్యార్థులు ఎంతమంది డ్రైవింగ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేశారు వారికి అవగాహన సదస్సు నిర్వహించారా.. రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టారని అడిగారు. గతంలో గుర్తించిన 19బ్లాక్స్ స్పాట్లలో 11 పనులు నేషనల్ హైవే అథారిటీ వారు పూర్తి చేశారని మిగిలిన పనులు కూడా త్వరలో పూర్తి చేస్తామని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. సమావేశంలో డీసీపీ రవీందర్, ఆర్‌టీవో అధికారి లక్ష్మి, జిల్లాకు చెందిన పలుశాఖల అధికారులతోపాటు పోలీసు శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, ట్రాన్స్‌పోర్ట్ శాఖ, నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్, మున్సిపల్ కమిషనర్, వరంగల్ సీఎస్‌వో, ఆర్ అండ్ బీ అధికారులు, ఎస్టీవో వరంగల్, ఆర్టీసీ అధికారులు తొమ్మిది మంది అధికారులతో కూడిన కండక్ట్ కమిటీని ఏర్పాటు చేశారు.